




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు









సంపుటి : 11 సంచిక :114 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 27 డిసెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :114 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 27 DECEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## బలహీనపడిన అల్పపీడనం.... అయినప్పటికీ వర్షాలే!

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఉత్తర తమిళనాడు-దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరువలో ఉందన్న ఐఎండీ
- దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం నేడు బలహీనపడిందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) అమరావతి విభాగం వెల్లడించింది. ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరాలకు చేరువలో ఉందని వివరించింది.

వివరాలు 2లో..



# బాధలు వింటూ.. భరోసా కల్పిస్తూ..

## పులివెందులలో వైయస్ జగన్ ప్రజాదర్బార్

## ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని వినతుల స్వీకరణ

**వైయస్ఆర్ జిల్లా: కూటమి ప్రభుత్వంలో తాము ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలను వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఎదుట ప్రజలు ఏకరువు పెట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మూడో రోజు పులివెందుల పర్యటనలో భాగంగా క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వైయస్ఆర్‌సీపీ శ్రేణులు, ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్న వైయస్ జగన్..వారికి భరోసా కల్పించారు.**

పెన్ పవర్ డెస్క్:పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్... కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. వారి బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ నేనున్నాను అంటూ భరోసాతో పాటు ధైర్యాన్ని కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు తెలుసుకుని, వారి సమస్యలు ఓపిగ్గా విని, వారికి భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని, అకారణంగా దాడులు చేస్తున్నారని పలువురు వైయస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు వైయస్ జగన్ వద్ద వాపోయారు. దీనికి ఆయన స్పందిస్తూ.. ఎవరూ అధైర్యపడొద్దని, మంచి రోజులు వస్తాయని, సమస్యలు శాశ్వతం కాదంటూ భరోసా కల్పించారు. త్వరలోనే మన ప్రభుత్వం మళ్లీ వస్తుందని, అప్పుడు అందరికీ మంచి జరుగుతుందని చెప్పారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు.

వివరాలు 2లో..



## ప్రజల కారణంగా వైసీపీ ఓడిపోలేదు... ఉద్యోగులు కూడా బాధపడుతున్నారు

- చంద్రబాబు అప్పులపై అప్పులు చేస్తున్నారన్న రోజా
- కూటమి నేతల తప్పుడు ప్రచారం వల్లే వైసీపీ ఓడిపోయిందని వ్యాఖ్య
- రాబోయేది వైసీపీ ప్రభుత్వమేనని ధీమా



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం ఏర్పడిన 6 నెలలకే ప్రజలకు నరకం చూపిస్తున్నా రని వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా విమర్శించారు. మహిళలు, విద్యార్థులు, యువతను ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు... అప్పులపై అప్పులు చేస్తున్నారని విమర్శించారు. ఈరోజు నగరిలో వైసీపీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రోజా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల కారణంగా వైసీపీ ఓడిపోలేదని... కూటమి నేతల తప్పుడు ప్రచారం వల్లే ఓడిపోయిందని రోజా అన్నారు. జగన్ ఓడిపోయినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని చెప్పారు. జగన్ హయాంలో ప్రజలకు అన్ని పథకాలు అందాయని తెలిపారు. వైసీపీ హయాంలో స్కూళ్లను జగన్ అద్భుతంగా తీర్చిదిద్దారని... కూటమి ప్రభుత్వం వైన్ షాపులను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. జగన్ ను ఓడించాలని ఉద్యోగులు కంకణం

వివరాలు 2లో..

## జగన్ ఇంటి ముందు ధర్నా చేయాలి... కలెక్టరేట్ల వద్ద కాదు



- విద్యుత్ ఛార్జీలను పెంచారంటూ ధర్నాలకు వైసీపీ పిలుపు
- విద్యుత్ ఛార్జీలను పెంచి వాళ్లే ధర్నాలకు పిలుపునివ్వడం హాస్యాస్పదం అన్న గొట్టిపాటి
- రివర్స్ పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేశారని మండిపాటు

వివరాలు 2లో..

## అస్వస్థతకు గురైన సోనియా గాంధీ

- అస్వస్థతకు గురైన కాంగ్రెస్ మాజీ అధినేత్రి
- కర్ణాటకలోని బెళగావిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు
- తల్లి వెంటే ఉన్న ప్రియాంక గాంధీ




పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత్రి, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యా రు. అస్వస్థత కారణంగా ఆమె కర్ణాటకలోని బెళగావిలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలకు దూరమ య్యారు.

వివరాలు 2లో..

## పుష్ప2లో ఏముంది..ఎర్రచందనం దొంగని హీరోగా చూపిండ్రు

### టికెట్ల రేట్లు పెంచడం బ్లాక్‌మార్కెట్లను ప్రోత్సహించడమే

### సామాన్య ప్రజల కోసం ఆలోచన చేయండి



పెన్ పవర్ డెస్క్:సంధ్య థియేటర్‌తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి 5 కోట్లు ఇచ్చినా వారి ప్రాణాలు తిరిగి తెచ్చి ఇవ్వలేరని సీపీఐ నాయకులు నారాయణ అన్నారు. ఇవాళ మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సినిమాతో అమాయక మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకారం ' ప్రయోజనాత్మకంగా సినిమాలు తీస్తే ప్రజలు ఆదరిస్తారు. రూ. వేల కోట్ల లాభాలు వచ్చే సినిమాలకు ప్రభుత్వాలు టికెట్‌రేట్ల పెంచేందుకు పర్మిషన్లు ఇవ్వడం ఎందుకు? పుష్ప 2 సినిమాలో అసలు ఏముంది?.. ఎర్రచందనం దొంగని హీరోగా చూపించి, దాన్ని యువతపై రుద్దుతున్నారు. అలాగే ఫీలింగ్స్ సాంగ్‌కు డాన్స్ చేయడం ఇష్టం లేకపోయినా డైరెక్టర్ చెప్పడం వల్ల చేయాల్సి వచ్చిందని హీరోయిన్ రష్మిక చెప్పారు. రష్మిక ఆవేదనను సానుకూలంగా అర్థం చేసుకోవాలి. ఇలా ఎంతోమంది

వివరాలు 2లో..

## వంగవీటి రంగా అందరివాడు..

- వంగవీటి రంగా 36వ వర్ధంతి
- విజయవాడలో కార్యక్రమం
- వంగవీటి రాధాపై తీవ్ర విమర్శలు చేసిన పోతిన మహేశ్

పెన్ పవర్ డెస్క్: వంగవీటి రంగా 36వ వర్ధంతి. ఈ సందర్భంగా విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో రంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. బెజవాడలోని చెరువు సెంటర్ లో ఏర్పాటు చేసిన రంగా వర్ధంతి కార్యక్రమానికి వైసీపీ నేత పోతిన వెంకట మహేశ్ హాజరయ్యారు. రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన... రంగా కుమారుడు

వివరాలు 2లో..



## పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతాం



- కండిషన్ బెయిల్‌పై వచ్చి ప్రెస్ మీట్ పెట్టడం సరికాదన్న ఐజీ
- కలెక్టర్ మీద దాడి చేసినందుకు నిందితులను అరెస్ట్ చేశామన్న ఐజీ
- ఏ ప్రభుత్వం కూడా రైతుకు బేడీలు వేయమని చెప్పదన్న ఐజీ

పెన్ పవర్ డెస్క్:వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి బెయిల్‌ను రద్దు చేయమని కోర్టును కోరుతామని ఐజీ సత్యనారాయణ అన్నారు. షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్న ఆయన ప్రెస్ మీట్ పెట్టడంపై ఐజీ సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కండిషన్ బెయిల్‌పై బయట ఉండి, ప్రెస్ మీట్ పెట్టడం

వివరాలు 2లో..

## డీఎంకేను గద్దె దించే వరకు చెప్పులు వేసుకోను... కొరడాతో కొట్టుకుంటాను

- 48 రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించిన అన్నామలై
- అన్నా యూనివర్సిటీ కేసులో సున్నితమైన సమాచారాన్ని లీక్ చేశారని ఆగ్రహం
- బాధితురాలి పేరు, ఫోన్ నెంబర్‌ను లీక్ చేశారన్న అన్నామలై



పెన్ పవర్ డెస్క్:తమిళనాట డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు తాను చెప్పులు ధరించనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అ న్నామలై ప్రతిజ్ఞ చేశారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఆయన వరుసగా నిరసన కార్యక్రమాలు చేపడుతు న్నారు. ఇటీవల చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల అంశంపై రాజకీయ దుమారం రేగింది. ఈ అంశంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం నాడుకోయంబత్తూరులో

వివరాలు 2లో..

## నా వల్ల తప్పు జరిగితే హోంగార్డుకైనా సారీ చెబుతా



- ఇటీవల నేషనల్ మీడియాపై పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తీవ్ర వ్యాఖ్యలు
- సంధ్య థియేటర్ ఘటనకు మద్దతిస్తున్నారంటూ విమర్శలు
- సీవీ ఆనంద్ పై నేషనల్ మీడియా ఆగ్రహం
- క్షమాపణ చెప్పిన సీవీ ఆనంద్

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇటీవల జాతీయ మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటన కు నేషనల్ మీడియా సంస్థలు మద్దతిస్తున్నట్టుగా ఉందని ఆయన అసహనం వెలిబుచ్చారు. అయితే తన వ్యాఖ్యల పట్ల సర్వత్రా విమర్శలు రావడంతో ఆయన క్షమాపణ చెప్పారు. దీనిపై

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# నిర్వీర్యమౌతున్న గ్రామీణ ఉపాధి పథకం

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమై 18 సంవత్సరాలు పూర్తి అయినా, గ్రామీణ పేదలకు పథకంలో పేర్కొన్న విధంగా పనులు కల్పించడంలో విఫలమైంది. గ్రామీణ పేదలకు సంవత్సరానికి 100 రోజులు పని కల్పించాల్సిన ఈ పథకం దినదిన గండం మారింది. 2005 ఆగస్టు 23న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలోని నార్పల మండలం బండమీదపల్లి గ్రామంలో 2006 ఫిబ్రవరి 2 ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 742 జిల్లాలు, 7,204 మండలాలు, 2,69,121 గ్రామ పంచాయతీల్లో ఈ పథకం అమల్లో ఉంది. ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకం నిర్వీర్యమవుతున్నది.దేశ వ్యాప్తంగా ఒక్క పని దినం కూడా నమోదు కాని పంచాయితీలు 13,467 ఉన్నాయంటే ఉపాధి హామీ పథకం అమలు ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది. ఉపాధి హామీ పథకం పనులకు ఇచ్చే వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉంది. వేతనాల పెంపుదల నామమాత్రమే. గత సంవత్సరంతో పోలిస్తే గోవాలో 10.56,% కర్ణాటకలో 10.40% వేతనం పెరగగా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 3% మాత్రమే పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో 10.29% పెరుగుదల ఉంది. 2923-24లో సగటు దినసరి వేతనం 261 రూపాయలు. నేడు పెంచిన కూలితో 289 రూపాయలుగా ఉంది. వ్యవసాయ పనులకు 4నుండి 5 వందల రూపాయల దాకా రోజు కూలీ ఉంది. దీన్ని గమనిస్తే ఉపాధి కూలీలు ఎలా దోపిడీకి గురవుతున్నది అర్ధమవుతున్నది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోలిస్తే, ఉపాధి కూలీలకు పెరిగిన వేతనం నామమాత్రమే. ఉపాధి పనులకు లభించే కూలీ, కూలీల కుటుంబ పోషణకు సరిపోక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. 2020-21లో రూ. లక్షా 9 వేల కోట్లు కేటాయిస్తే, 2022- 2023లో రూ. 73 వేల కోట్లకు నిధుల కేటాయింపు తగ్గింది. 2024 -25 బడ్జెట్‌లో 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. 2021లో వేతన కూలీ 255 రూపాయలు ఉంటే, నేడు 305 రూపాయలుగా ఉంది. పెరిగిన వేతనం ప్రకారం తాజా బడ్జెట్‌లో రూ. లక్షా 30 వేల కోట్లు కేటాయించాలి. ఉపాధి కోల్పోయిన కుటుంబాలు. బడ్జెట్ కేటాయింపులు తగ్గటంతో ఉపాధి పని దినాలు కూడా తగ్గాయి. 2020-21లో ఉపాధి పథకం కింద పని చేసే కుటుంబాలు 7 కోట్ల 55 లక్షల ఉంటే, 2023లో 4 కోట్ల 68 లక్షలకు తగ్గింది. అంటే 2 కోట్ల 87 లక్షల కుటుంబాలు ఉపాధి పనులకు దూరమయ్యారు. 2020- 21లో సగటు కుటుంబానికి 52 రోజులు పని కల్పిస్తే, నేడు 47 రోజులకు పడిపోయింది. వంద రోజులు పని చేసిన కుటుంబాలు 71,97,090 ఉంటే నేడు 44,97,113 గా ఉన్నాయి.ఉపాధి హామీ పథకం గురించి నియమించిన పార్లమెంటరీ స్థాయి కమిటీ, వ్యవసాయ కూలీల వేతనాలకు దీటుగా ఉపాధి కూలీల వేతనాలు ఉండాలని ప్రభుత్వానికి సూచించింది. అలాగే పురుషులతో సమానంగా స్త్రీలకు వేతనం ఇవ్వాలని చెప్పింది. వ్యవసాయ కూలీల కనీస వేతనం 375 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ఉపాధి పథకం వేతనాల్లో రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసాన్ని పార్లమెంటరీ ప్యానల్ ఆక్షేపించింది. దేశ వ్యాప్తంగా ఉపాధి వేతనాలు ఒకే విధంగా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వివిధ రాష్ట్రాల్లో ఉపాధి వేతనాలు 204 నుండి 318 రూపాయల మధ్య ఉన్నాయని తెలిపింది.తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురికావటమే కాకుండా, ఆ వేతనాన్ని కూడా కూలీలు పొందలేకపోతున్నారు.కూలీలకు ఇవ్వాల్సిన వేల కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బకాయిలు పెడుతున్నాయి. 2023 జనవరి నాటికి కేంద్ర ప్రభుత్వం కూలీలకు 13 వేల కోట్ల రూపాయలు బకాయిపడిందని పార్లమెంటరీ ప్యానల్ తెలియచేసింది. 2024 ఏప్రిల్ నాటికి రూ. 20,751 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని బకాయిలపై ప్యానల్ ప్రశ్నలు వేసింది. కూలీల వేతనాలు పెంచటానికి ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని గ్రామీణాభివృద్ధి శాఖ (డిఒఆర్‌డి)ని కోరింది.ఎపిలో మూడు నెలలుగా వేతనాలు ఇవ్వని ఫలితంగా కూలీలకు 2,300 కోట్ల రూపాయల బకాయిలు ఉండగా, తెలంగాణలో రూ. 200 కోట్లు కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. స్వరాజ్ అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన ప్రజాప్రయోజనాల వాజ్యంపై న్యాయస్థానం స్పందిస్తూ 'తీరుబడిగా వేతనాలు ఇస్తామంటే ఎలా కుదురుతుంది? కరువుసాయం చేయడమంటే ఏదో ముష్టి వేస్తున్నామన్న భావన, ఉండటం మంచి పద్ధతి కాదు' అని వ్యాఖ్యానించింది.మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతికి నిలయంగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల జేబులు నిండుతున్నాయి. కూలీల హాజరులో మోసాలు, కూలీలకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా తమ వద్దే ఉంచుకుని వడ్డీలకు ఇస్తున్న అధికారులు, కూలీల వేతనం తగ్గించి ఇవ్వటం, పనులు చేయకుండా, చేసినట్లు రికార్డులు సృష్టించటం వల్ల ఉపాధి పనుల్లో కోట్లాది రూపాయల అవినీతి జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకం నిధులను వేరే వాటికి మళ్లించటం వల్ల కూడా అనేక అవకతవకలకు కారణంగా ఉంది. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అవకతవకల గురించిన అనేక మోసాలకు సంబంధించిన వివరాలను వెల్లడించింది.ఎవరైనా ఉపాధి పనుల అవినీతి మోసాన్ని బహిర్గతం చేస్తే వారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. జార్ఖండ్‌లో ఉపాధి పథకం లో మోసాన్ని చూపించిన ఒక కార్యకర్త హత్య చేయబడ్డాడు. ఎన్‌జిఒలు నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలపై అధికారుల బృందం రాజస్థాన్‌లో కేసులు వేశారు. తనిఖీలకు వ్యతిరేకంగా శక్తివంతమైన లాబీ ముఠాలు ఉన్నాయి. జనాభాలో 70 శాతం ప్రజలు, శ్రామిక శక్తి గ్రామీణ ప్రాంతంలోనే నివసిస్తున్నారు. వ్యవసాయమే నేటికీ దేశానికి కీలకంగా ఉంది.పాలకుల విధానాల వల్ల ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లిన శ్రామికులు కోవిడ్ కాలంలో ఉపాధిని కోల్పోయి తిరిగి గ్రామాలకు వచ్చారు. వారిని గ్రామాలు ఆదరించాయి. వారికి పని కావాలి. అందుకు వ్యవసాయ పనులతో పాటు అదనంగా గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించినప్పుడే వారికి ఉపాధి లభిస్తుంది.సేద్యపు భూమి కొద్ది మంది భూ కామందుల చేతుల్లో బందీగా ఉంది. వారి బంధనాల నుండి భూమిని విముక్తి చేసి పేదలకు భూ పంపిణీ జరిగినప్పుడే ఉపాధి సమస్య పరిష్కారంతో పాటు వలసల నివారణ జరుగుతుంది. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం భూములు పంచదు. ప్రజలే పోరాడి సాధించుకోవాలి. అందుకోసం పోరాడుతూనే, గ్రామీణ ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలని, రోజు కూలీ 500 రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

# బాధలు వింటూ..భరోసా కల్పిస్తూ..

- మొదటి పేజీ తరువాయి
కష్టాలు ఎల్లకాలం ఉండవని, ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతున్న కూటమి నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు శ్రీ వైయస్ జగన్ సూచించారు.

**ఆపన్నులకు అండగా**

వివిధ సమస్యలతో బాధపడుతున్న పలువురు వైయస్ జగన్ వద్ద వారి సమస్యలు విన్నవించుకున్నారు. వారి సమస్యలను ఆలకించిన ఆయన వారికి అన్నలా అండగా ఉంటానని ధైర్యాన్నిచ్చారు. స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. వారి సమస్య పరిష్కారానికి ఏమి చెయ్యాలో పక్కనే ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు.ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి మేలు ఒకటి కూడా జరగలేదని వచ్చిన వారంతా తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అన్ని వర్గాలకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చిన శ్రీ వైయస్ జగన్, వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ప్రజల నడ్డి విరుస్తున్న విద్యుత్ ఛార్జీలపై ప్రజల పక్షాన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని, రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

# వంగవీటి రంగా అందరివాడు..

- మొదటి పేజీ తరువాయి
వంగవీటి రాధాకృష్ణపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వంగవీటి రంగా అందరివాడుగా పేరు తెచ్చుకున్నాడని, కానీ రాధా మాత్రం ఆయనకు కుటుంబ వారసుడిగానే మిగిలుపోతున్నాడని అన్నారు. రంగా ఆశయాల కోసం రాధా ముందుకురావడంలేదని, కేవలం ఎన్నికల సమయంలోనే రాధా బయటికి వస్తున్నారని వ్యాఖ్యానించారు. "రంగా సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన వ్యక్తి... ప్రజా సమస్యలపై, కాపు సమాజ ఇబ్బందులపై మాట్లాడకపోవడం బాధాకరం. రాధా ఆలోచన ఏంటో అర్థం కావడంలేదు. కాపు వర్గం అణచివేతకు గురవుతున్నా స్పందించడం లేదు... కనీసం కాపు రిజర్వేషన్లపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. రంగా విగ్రహాలను ఆవిష్కరిస్తూ ఆయనకు తానే వారసుడ్నని చెప్పుకోవడం తప్ప రాధా చేస్తున్నది ఏమిటి? రంగా వారసులుగా మేం అనేక పోరాటాలు చేశాం... కానీ రాధా మాత్రం బీసీ వర్గాల భవిష్యత్తును నాశనం చేసే వ్యక్తులతో చేతులు కలపడం దురదృష్టకరం. జిల్లాకు రంగా పేరు పెట్టాలని ఒక్క మాట మాట్లాడొచ్చు కదా... కనీసం వారి పార్టీ అధికారంలో ఉన్నప్పుడైనా మాట్లాడకపోతే ఎలా! రాధా పదవి గురించి కాకుండా, ఇకనైనా తన తండ్రి రంగా ఆశయ సాధన కోసం కృషి చేయాలి" అని పోతిన మహేశ్ స్పష్టం చేశారు.

## బలహీనపడిన అల్పపీడనం....
# అయినప్పటికీ వర్షాలే!

- మొదటి పేజీ తరువాయి
అయితే, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని... దీని ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాల్లో ఇవాళ కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి పేర్కొంది. అదే సమయంలో రాయలసీమ, ఉత్తర కోస్తా జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా, అల్పపీడనం బలహీనపడినప్పటికీ నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో గణనీయ స్థాయిలో వర్షపాతం నమోదైంది.

# పుష్ప2లో ఏముంది..ఎర్రచందనం దొంగని హీరోగా చూపిండ్రు

- మొదటి పేజీ తరువాయి
మహిళలు ఆత్మాభిమానం చంపుకుని పని చేస్తున్నారు. ప్రభుత్వాలు సందేశాత్మక చిత్రాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. టికెట్ల ధరలను పెంచడం బ్లాక్ మార్కెట్లకు ప్రోత్సాహం ఇవ్వడమే అవుతుంది. ప్రభుత్వ నిర్ణయాలు సామాన్య ప్రజలకు భారం పడకుండా ఉండాలి' అని నారాయణ అన్నారు.

# జగన్ ఇంటి ముందు ధర్నా చేయాలి... కలెక్టరేట్ల వద్ద కాదు

**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిందని ఆరోపిస్తూ వైసీపీ ధర్నాలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి రవి స్పందిస్తూ... వైసీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వాళ్లే ధర్నాలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రపంచంలో ఇంత వింత ఎక్కడా ఉండదని చెప్పారు. ధర్నా చేయాల్సింది కలెక్టరేట్ల వద్ద కాదని... జగన్ ఇంటి ముందు చేయాలని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచాలని ఈఆర్సీకి సిఫారసు చేసింది జగన్ కాదా? అని గొట్టిపాటి ప్రశ్నించారు. గతంలో రాష్ట్రానికి టీడీపీ ప్రభుత్వం మిగులు విద్యుత్ ఇచ్చిందని... ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ విద్యుత్ రంగ వ్యవస్థలను నాశనం చేశారని విమర్శించారు. సొంత మనుషులకు దోచి పెట్టేందుకు అధిక ధరలతో విద్యుత్ కొనుగోలు చేశారని అన్నారు. రివర్స్ పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేశారని దుయ్యబట్టారు.

# అస్వస్థతకు గురైన సోనియా గాంధీ

- మొదటి పేజీ తరువాయి
'నవ సత్యాగ్రహ బైఠక్' పేరిట నిర్వహిస్తున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలకు సీడబ్ల్యూసీ సభ్యులతో పాటు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, మాజీ సీఎంలు, పార్లమెంటరీ పార్టీ ఆఫీస్ బేరర్లు... ఇలా దాదాపు 200 మంది కాంగ్రెస్ నేతలు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. అయితే, సోనియా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ప్రియాంక గాంధీ తల్లి వెంటే ఉన్నారు. సోనియా కోలుకుంటే ప్రియాంక కూడా ఈ సమావేశాలకు హాజరవుతారని తెలుస్తోంది. కాగా, రాహుల్ గాంధీ ఈ సమావేశాలకు హాజరయ్యారు.

# నా వల్ల తప్పు జరిగితే హోంగార్డుకైనా సారీ చెబుతా

- మొదటి పేజీ తరువాయి
ఓ నెటిజన్ స్పందిస్తూ... చేసిన తప్పును అంగీకరించడం గొప్ప విషయమని, అదే మిమ్మల్ని ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెట్టిందంటూ సీవీ ఆనంద్ ను ఉద్దేశించి ట్వీట్ చేశారు. నరేశ్ అనే వ్యక్తి చేసిన ఆ ట్వీట్ ను సీవీ ఆనంద్ రీట్వీట్ చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఎప్పుడైనా నేను తప్పు చేశానని భావిస్తే నా హోంగార్డుకైనా సరే క్షమాపణ చెప్పేందుకు వెనుకాడను. ఈ గుణం నాలో చిన్నప్పటి నుంచి ఉంది. బహుశా క్రికెట్ ఆడడం వల్ల వచ్చి ఉంటుంది. క్రికెట్ ఆడడం అనేది నన్ను మెరుగైన వ్యక్తిగా మలిచింది. నా అహాన్ని వదిలేయడం ద్వారా నేను అందరిలో ఒకడిగా ఉండాలనుకుంటాను. ఓ వ్యక్తిని పరిపూర్ణ మానవుడిగా మలిచేందుకు జట్టుగా ఆడే క్రీడలు చాలా ముఖ్యమని భావిస్తాను. కానీ కార్పొరేట్ తరహా విద్యా వ్యవస్థలో ఇటువంటి అవకాశం లేకుండా పోవడం దురదృష్టకరం" అని సీవీ ఆనంద్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# ప్రజల కారణంగా వైసీపీ ఓడిపోలేదు... ఉద్యోగులు కూడా బాధపడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి
కట్టుకున్నారని... చంద్రబాబును ఎందుకు గెలిపించామా? అని ఇప్పుడు వాళ్లంతా బాధపడుతున్నారని అన్నారు. రాబోయేది వైసీపీ ప్రభుత్వమేనని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుప్పం సహా అన్ని నియోజకవర్గాలను వైసీపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ క్యాడర్ ను ఎవరెవరైతే ఇబ్బందులు పెడుతున్నారో... వారికి వడ్డీతో సహా చెల్లిస్తామని అన్నారు. పచ్చ మీడియా అసత్యాలను ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు.

# ఆధారాలు లేకుండా ఈవీఎంలను నిందించలేం: సుప్రియా సూలే

**నాలుగుసార్లు ఈవీఎంల ద్వారానే గెలిచానన్న సుప్రియాసూలే**

**అలాంటప్పుడు అందులో స్కాం ఉందని ఎలా చెబుతానని ప్రశ్న**

**వాస్తవాలను బయటకు తీసుకొచ్చేలా చర్చ జరగాలన్న సుప్రియా**



ఎలాంటి ఆధారాలు లేకుండా ఈవీఎంలను తాను నిందించలేనని ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. ఈవీఎంలపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు ఈవీఎంలను నిందించడాన్ని తప్పుబట్టారు. తాజాగా, ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ కూడా అదే రకమైన వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంల ద్వారా జరిగిన ఎన్నికల్లోనే తాను నాలుగుసార్లు విజయం సాధించానన్నారు. అలాంటప్పుడు అందులో స్కాం ఉందని ఎలా చెప్పగలుగుతామని వ్యాఖ్యానించారు. ఆధారాల్లేకుండా ఈవీఎంలను తప్పుబట్టలేమన్నారు. ఈవీఎంలలో అవకతవకలపై కొంతమంది ఆరోపణలు చేస్తున్నారని, ఇందులో వాస్తవాలను బయటకు తీసుకువచ్చేలా చర్చ జరగాల్సి ఉందని సుప్రియాసూలే అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాపై చాలామంది ప్రశ్నలు లేవనెత్తుతున్నారని, కాబట్టి ఈవీఎం అయినా... బ్యాలెట్ పేపర్ అయినా పారదర్శకంగా జరిగితే ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమేనని తెలిపారు. ప్రజలు బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరగాలని కోరుకుంటే అలాగే చేయాలని, ఈవీఎంలు కావాలనుకుంటే వాటినే ఏర్పాటు చేయాలన్నారు.

# పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతాం

- మొదటి పేజీ తరువాయి
నిబంధనలు ఉల్లంఘించడమే అన్నారు.ఈ క్రమంలో ఆయన బెయిల్ రద్దు చేయాలని కోర్టును కోరుతామన్నారు. కేసు విచారణ కొనసాగుతోందని, ఇలాంటి సమయంలో ఆయన వ్యాఖ్యలు విచారణను ప్రభావితం చేసేలా ఉన్నాయన్నారు. లగచర్ల ఘటన జరిగిన రోజున 230 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశామని, కాబట్టి ఇందులో పోలీసుల వైఫల్యం ఉందని చెప్పడం సరికాదన్నారు. కలెక్టర్ మీద దాడి చేసినందుకే నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

పోలీసులు కొట్టినట్లుగా వచ్చిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. పట్నం నరేందర్ రెడ్డిని ఫార్మా భూసేకరణకు సంబంధించిన అంశంలో అరెస్ట్ చేయలేదని, కలెక్టర్ మీద దాడి కేసులో అరెస్ట్ చేశామన్నారు. అనుమానితులను తాము మూడు విడతల్లో అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ఘటనతో సంబంధం లేని వారిని తాము వదిలేశామన్నారు. పట్నం నరేందర్ రెడ్డి ప్రెస్ మీట్‌లో అవాస్తవాలు చెప్పడం సరికాదన్నారు.ఏ ప్రభుత్వం కూడా రైతుకు బేడీలు వేయమని చెప్పదని, నిందితుడు సురేశ్ వాయిస్ రికార్డ్ తమ వద్ద ఉందన్నారు. దాడి ఘటనను ప్లాన్ చేసింది అతనే అన్నారు. సమయం వచ్చినప్పుడు బయటపెడతామని వెల్లడించారు. పట్నం నరేందర్ రెడ్డి తన ఫోన్ పాస్‌వర్డ్‌ను చెప్పడం లేదన్నారు. నరేందర్ రెడ్డి, సురేశ్ ఈ కేసులో విచారణకు సహకరించడం లేదన్నారు.కాగా, ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికించారని పట్నం నరేందర్ రెడ్డి వాపోయారు. లగచర్ల రైతులను పోలీసులు కొట్టారని, గ్రామంలో ఆడవారిపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ ప్రెస్ మీట్‌పై ఐజీ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## డీఎంకేను గద్దె దించే వరకు చెప్పులు వేసుకోను...
# కొరడాతో కొట్టుకుంటాను

- మొదటి పేజీ తరువాయి
ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నా యూనివర్సిటీలో జరిగిన లైంగిక వేధింపుల కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు.ఆయన ఇంకా మాట్లాడుతూ, నిరసనలో భాగంగా శుక్రవారం నాడు తన నివాసం వద్ద ఆరుసార్లు కొరడాతో కొట్టుకుంటానన్నారు. రేపటి నుంచి 48 రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే పార్టీని గద్దె దించే వరకు తాను చెప్పులు వేసుకోనన్నారు.అన్నా యూనివర్సిటీ కేసుకు సంబంధించి సున్నితమైన సమాచారాన్ని అధికారులు లీక్ చేశారని ఆరోపించారు.

ఈ కేసులో బాధితురాలికి సంబంధించిన సమాచారాన్ని లీక్ చేశారని మండిపడ్డారు. ఆమె పేరును, ఫోన్ నెంబర్‌ను ఎఫ్ఐఆర్ ద్వారా లీక్ చేశారని మండిపడ్డారు. తద్వారా పోలీసులు ఈ కేసులో సరిగ్గా వ్యవహరించలేకపోయారన్నారు.

# రంగా ప్రజానాయకుడు-మాజీ మంత్రి వనిత



**గోపాలపురం,పెన్ పవర్ డిసెంబర్ 26 :**వంగవీటి మోహన్రంగా గొప్ప ప్రజానాయకుడని మాజీ మంత్రి తానేటి వనిత కొనియాడారు. నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామంలో రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్గీయ వంగవీటి మోహన్రంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వనిత హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ,మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు,మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా,కుప్పాల వాసు బాబు,మాజీ మార్క్ ఫ్యాడ్ చైర్మన్ వడ్డీ రఘునందన్ రావు,ఎంపీపీ బంక జయలక్ష్మి,వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ తదితరులు పాల్గొన్నారు.


# పెన్ పవర్

## ఉభయ గోదావరి

కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు




# విధులకు దుమ్మా కొట్టి..!

## పెళ్లి చేయిస్తున్న వ్రత పురోహిత సూపర్వైజర్

## చోద్యం చూస్తున్న అధికారులు!

**అన్నవరం, పెన్ పవర్, డిసెంబర్ 26 :** అన్నవరం కొండపై వ్రతముల విభాగంలో పనిచేస్తున్న ఒక పురోహిత సూపర్వైజర్ తన విధులకు దుమ్మా కొట్టి ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కొండపైన వివాహాలు చేసుకునే భక్తులు పురోహితుడి నిమిత్తం దేవస్థానానికి తగిన రుసుము చెల్లించాల్సి ఉంది. అలా చెల్లించిన పక్షంలో దేవస్థానమే స్వయంగా పురోహితుడిని వివాహ కార్యక్రమానికి పంపించడం జరుగుతుంది. ఇందులో కేవలం దిగువ స్థాయి పురోహితులు మాత్రమే కొండపైన జరిగే వివాహ కార్యక్రమాలకి వెళ్లాల్సి ఉంది. కానీ గురువారం నాడు కొండపైన ఈవో కార్యాలయం ఎదురుగా ఉన్న సర్క్యులర్ మండపం వద్ద జరిగే వివాహ కార్యక్రమానికి వ్రతాల విభాగంలో పనిచేస్తున్న సూపర్వైజర్ తనదైన శైలిలో హాజరవడంపై క్షేత్రస్థాయి పురోహితులు మండిపడుతున్నారు. వ్రతం చేయించుకునే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వ్రతానికి కావలసిన సామాగ్రిని పురోహితులు అందిస్తున్నారా? లేదా? అనే దానిపై పర్యవేక్షణ చేయాల్సిన సూపర్వైజర్ ఈ విధంగా ప్రవర్తించడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. విధులు నిర్వర్తించే సమయంలో ఎటువంటి ప్రైవేటు కార్యక్రమానికి పురోహిత సూపర్వైజర్లు కానీ హెడ్ లు కానీ పాల్గొనకూడదని క్షేత్రస్థాయి పురోహితులే కార్యక్రమాన్ని జరిపించాలనే నిబంధన ఉందని చెబుతున్నారు. అధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయకుండా పురోహిత సూపర్వైజర్ ఈ విధంగా ప్రవర్తించడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం ఈవో కార్యాలయానికి ఎదురుగానే ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలకు ఉపక్రమించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దేవస్థానం ఈవో సుబ్బారావు దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి పురోహితులు కోరుతున్నారు.

# ఎస్సీ ఎస్టీలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు కలెక్టర్





కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు

**అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్,డిసెంబర్ 26**. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు ఎస్సీ ఎస్టీ దురాగతాల నివారణ చట్టం అమలుపై ఎస్సీ ఎస్టీ నిఘా మరియు పర్యవేక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు తెగల అట్రాసిటీ కింద నమోదైన కేసులు సత్వరమే పరిష్కరించి తగు న్యాయం చేకూర్చే దిశగా రెవెన్యూ పోలీస్ న్యా యవ్యవస్థలు కృషి చేయా లన్నారు. ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న దాడులు అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి, పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు అణగారిన వర్గాలలో జరుగుతున్న అన్యాయాలపై రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కమిటీ సభ్యులు అంకిత భావంతో పాటుపడాలన్నారు అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించి దళితులకు ఎక్కడా అన్యాయం చోటు చేసు కోకుండా చూడాలన్నారు జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, సమాజంలో ఎస్సీ ఎస్టీలపై దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత చట్టాల పట్ల అవగాహన పెంపొం దించా ల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టులలో కేసుల సత్వర పరిష్కారం కొరకు ఎటువంటి జాప్యం జరగ కుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కేసుల సత్వర విచారణకు అవసరమైన ధ్రువ పత్రాలు ఎప్పటికప్పుడు తహశీల్దార్లు జారీ చేయాలన్నారు. నిజమైన బాధితులకు న్యాయం జరగాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, రక్షణ కొరకు ఏర్పాటైన చట్టాల పటిష్ట అమలుకు పోలీస్, న్యాయ రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచే యాలని కలెక్టర్ కోరారు గతంలో జరిగిన కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను, ఈ త్రైమాస కాలంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ, బాధితులకు పరిహారాల పంపిణీ పురోగతిని సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 95 కేసులు నమోదు కాగా వీటిలో ప్రాథమిక విచారణ దశలో 52 కేసులు, చార్జి సీటు దశలో 49 కేసులు, పోస్ట్ మార్టం దశలో రెండు కేసులు ఉండగా సంబం ధిత బాధితులకు రూ 81, లక్షల 25 వేలు చెల్లించాల్సింది ఉందని 30 లక్షలు మేర మాత్రమే నిధులు ఇటీవల మంజూరు కావడం జరిగిందన్నారు పౌరులందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి అనుగుణంగా ఏర్పాటు కాబడిన ఎస్సీ ఎస్టీ ప్రత్యేక చట్టాలను అధికారులు పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్థానికంగా కోనసీమ జిల్లాకు ఎస్సీ ఎస్టీ కోర్టు మంజూరు అయిందని తెలిపారు ఎస్సీ ఎస్టీలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా కల్పిస్తున్న రుణ సదుపాయాల ద్వారా సుస్థిర జీవనోపాదుల కల్పనకు పాటు పడాలన్నారు ఆర్డబ్ల్యూ ఎస్ వారు ఎస్సీ ఎస్టీ కాలనీలకు జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిని వేయాలన్నారు. సఫాయి కర్మచారి కార్మికులకు పథకాల ద్వారా లబ్ధిని చేకూర్చాలన్నారు పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా మండలానికి నాలుగు చొప్పున యూనిట్లు గ్రౌండ్ చేయాలన్నారు. డ్వామా ద్వారా వేతన జీవులకు నూరు శాతం పని దినాలు సరాసరి వేతనాలు చెల్లిస్తూ మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా ఆవాసాలలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. లక్షిత వర్గాల వారికి ఉద్యాన సాగును పథకాలు,రాయితీలతో ప్రోత్సహించి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా నిర్దేశిత ఎస్సీ ఎస్టీ లబ్ధిదా రులకు ట్రావెలింగ్ బిజి నెస్ క్వాయర్ పరిశ్రమల కు రాయితీతో యూనిట్లు గ్రౌండ్ చేయాలన్నారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా లక్షిత వర్గాలకు లబ్ధిని చేకూర్చాలన్నారు స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ పోలీస్ అధికారులు తమ స్టేషన్లకు వచ్చిన ఫిర్యా దులపై రాజీపడాలని ధోరణిని ప్రదర్శించడంతో మరల అవే కేసులు పునరావృతం అయ్యి జటిలంగా మారుతున్నాయని కావున ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో స్వీకరించి తప్పనిసరిగా విచారించాలని సూచించారు. కేసులలో ఎఫ్ఐ ఆర్, చార్జి సీటు నమోదు ప్రస్తుత స్థితిగతులు పురోగతి అంశాలు ప్రతి శాఖలో సంక్షేమ పథ కాలకు నిధులు మంజూరు కేటాయింపులపై సంబంధిత శాసన సభ్యులకు నివేదిక సమర్పించిన యెడల ఆ యొక్క పథకాలకు అర్హుల ఎంపికకు అవకాశం అధికారులతో పాటు తమకు లభిస్తుందన్నారు తప్పుడు కేసులు విషయంలో ఏయే కారణాలు చేత ఆయా కేసులను తిరస్కరించారో కూడా తెలియజేయాలని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు పరిహారం ఉపాధి కల్పన విషయం లో జాప్యం జరగకుండా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. శాంతియుతమైన సామరస్య మైన పౌర జీవనాన్ని పెంపొందించేందుకు ఈ చట్టాల గురించి అన్ని వర్గాల ప్రజలకు సమగ్ర మైన అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్థిక సామాజిక రంగాలలో సమాన అవకాశాలను పొందేందుకు సామాజిక న్యాయం అందించేందుకు అగ్రవర్ణాల అత్యాచారాల నుండి రక్షణ పొందేందుకు ఈ చట్టం రూపొందించబడిందన్నారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటికేసుల విచార ణ వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించా లన్నారు. దోషులకు తప్పనిసరిగా శిక్షపడా లని ప్రేరేపిత కేసులకు ఆస్కారం ఇవ్వరాదన్నారు, లక్షిత వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని,అదే స్ఫూర్తితో కమిటీ సభ్యులు ప్రయోజనకరమైన, నిర్మాణాత్మ కమైన సూచనలు, సమీక్షలతో ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ, హక్కుల పరిరక్షణ కొరకు పనిచే యాలన్నారు.ఎస్సీ, ఎస్టీ కేసుల పరిశోధన విచారణ ప్రగతి, విచారణ, కోర్టు కేసులలో కన్విక్షన్, బాధితులకు పరిహారం అంశాలపై పోలీస్, రెవె న్యూ శాఖలు శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డిఆర్ఓ ఇన్చార్జ్ కే మాధవి, ఆర్డీవోలు పీ శ్రీకర్ డి అఖిల, జిల్లాస్థా యి అధికారులు డిఎస్పీ లు తదితరులు పాల్గొన్నారు.

# అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ లపై నిఘాతో డెకాయ్ ఆపరేషన్లుచేపట్టాలి -ఆర్డీవో కే మాధవి





**అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్,డిసెంబర్ 26:** గర్భస్థ పిండ ఆరోగ్య పరిశీలన కొరకు వినియో గించే అల్ట్రా స్కానింగ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘాతో పాటుగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆర్డీవో కె మాధవి తెలిపారు గురువా రం రెవెన్యూ డివిజన్ కార్యా లయంలో ఆర్డీవో అధ్యక్షతన అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి (పీసీ, పీఎన్ డీటీ) లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 చట్టం అమలు తీరు అంశాలపై సమీక్షించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించేందుకు ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగిందని తదనుగుణంగా అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణ కు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధ నలకు విరుద్ధంగా లింగనిర్ధా రణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై డేకాయ్ ఆపరేషన్లు నిర్వహించి చట్ట ప్రకారం చర్యలు గైకొనాలని ఆమె కమిటీ సభ్యులకు సూచించారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహిం చాలన్నారు. కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో కూడా అనధికారికంగా జరుగుతున్న అబార్షన్లను గుర్తించి లింగ నిర్ధారణ నిషేధిత చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్ల రెన్యువల్ నిమిత్తం డివిజన్ స్థాయి కమిటీ ఆమోదించిన దరఖా స్తులను జిల్లా స్థాయి కమిటీకి నివేదించాలని సూచించారు ప్రతి స్కానింగ్ సెంటర్ లోను చట్టానికి సంబంధించిన వాల్పోస్టర్లను, వివరాలతో తప్పని సరిగా ప్రదర్శిస్తూ ఆడ పిల్లల పట్ల వివక్షతను పూర్తి గా రూపుమాపుతూ స్త్రీ పురుష లింగ నిష్పత్తి సమాన త్వ సాధన ద్వారా ఆరోగ్యకర సమాజ స్థాపనకు సమిష్టిగా పాటుపడాలన్నారు. స్వచ్ఛం ద సంస్థల సహకారంతో లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలు విధి విధానాలపై ప్రజల్లో పరిపూర్ణ అవగాహన పెంపొందించాలన్నారు. అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ సి హెచ్ వి భరత లక్ష్మి ప్రసంగిస్తూ ఆడ శిశువుల పట్ల వివక్షత జరిగే ప్రాం తాలలో భ్రూణ హత్యలను నివారిం చడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డెకా య్ ఆపరేషన్ నిర్వహించా లన్నారు. గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్విని యోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించు కోవడం చట్ట రీత్యానేరమని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు. స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి లింగ వివక్షతకు తావు లేకుం డా చర్యలు చేపట్టాలన్నారు పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమ న్వయం విస్తృత అవగాహన పెంపొందించాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రసూ తి వైద్య నిపుణులు డాక్టర్ మాధురి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పి వి పృధ్విరాజ్ రేడియాలజిస్ట్ డాక్టర్ భరత్ సిఐ వీరబాబు లీగల్ సెల్ ఎన్జీవోల ప్రతిని ధులు తదితరులు పాల్గొన్నా రు.

# సి ఎస్ ఆర్ నిధులతో జిల్లా అభివృద్ధికి

# అంచనాలు రూపొందించాలి

## వివిధ శాఖల ఇంజనీర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్




**అమలాపురం , పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్,డిసెంబర్ 26:** గురువారం స్థానిక కలెక్టరేట్లో సిఎస్ఆర్ నిధులు మంజూరు కేటా యింపుల అంచనాల రూపకల్పన పై అధికారు లు ఇంజనీర్లతో చర్చిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజ కవర్గాల వారీగా ప్రజాప్రతి నిధులు తెలిపి న పనుల కు సంబంధించి అంచనాలు రూపొందిం చాలని ఇంజనీర్లను ఆదేశించారు. సముద్ర ముఖద్వారం వద్ద వద్ద డ్రెడ్జింగ్ పనులు, చేపడు తూ వివిధ పంటల ముంపు బెడద నివారణ చర్యలు, అధునాతన డ్రోన్ సాంకేతిక టెక్నాలజీ ఆధారంగా కాలువలు, డ్రెయిన్ల స్థలాల ఆక్రమ ణలను గుర్తింపు మౌలిక సదుపాయాలైన రోడ్లు, విద్యా సంస్థలలో మౌలిక వసతులకు సంబంధించి న మరమ్మత్తులు వంటి పనులకు అంచనాలు రూపొందించి చమురు సహజ వాయువుల సంస్థలకు మంజూరు నిమిత్తం సమర్పించాలని జిల్లా అర్ధ గణాంకాధికారి (సిపిఓ) ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకటేశ్వర్లు పంచాయితీరాజ్ సూపరింటెండెం ట్ ఇంజనీర్ పి రామ కృష్ణారెడ్డి, డి ఈ రాజకు మార్, ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్సీ సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చింతలూరులో సి సి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు.



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 26:**చింతలూరు గ్రామంలో బీసీ ఏరియా నందు 8 లక్షలు మరియు 12 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన రెండు సి సి రోడ్లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీలకు కేరాఫ్ తాడేపల్లిగూడెం







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 26:** తాడేపల్లిగూడెం నకిలీలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు కేంద్రంలో ఉన్న తాడేపల్లిగూడెం ఈ నకిలీలకు కేరాఫ్ గా మారింది. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో నకిలీలు చేస్తున్న వ్యక్తులు ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి ఆసుపత్రులు పాలవుతున్నారు. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నకిలీ వ్యాపారం చేస్తున్న వ్యక్తులు లక్షలాది రూపాయలు ఆర్జించి వీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో తాడేపల్లిగూడెం డబ్లింగ్ కరెన్సీ భారీ ఎత్తున వ్యాపారం జరిగేది. అప్పట్లో ప్రభుత్వం ఈ వ్యాపారంపై ఉక్కు పాదం మోపడంతో కొంతమేరకు ఆగింది. ప్రస్తుతం తాడేపల్లిగూడెం మార్కెట్లో నిత్యావసర సరుకులు కల్తీమయం భారీ ఎత్తున అమ్ముడవుతున్నాయి. వీటిని వినియోగదారులు గుర్తించడం కష్ట సాధ్యం. దీంతో వ్యాపారస్తులు నిత్యావసర సరుకులను కల్తీ చేసి అమ్ముతున్నారు. మిరియాలు గింజల్లో బొప్పాయి గింజలు, జీలకర్రలో సోంపు, కారంలో ఇటుక పొడి, పంచదారలో ఇడ్లీ రవ్వ, ఇక కారం, టీ పొడి అయితే బ్రాండెడ్ కంపెనీల కవర్లను మార్పు చేసి అందులో నకిలీ టీ పొడి కారంపొడులను ప్యాక్ చేసి అమ్ముతున్నారు. ఇక బియ్యం విషయానికొస్తే పాత కొత్త కలయికలతో మార్కెట్లో అమ్ముతున్నారు.

ఇన్ని జరుగుతున్నా వీటిపై అజమాయిషీ లేకపోవడంతో ఈ వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఈ వ్యాపారం పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు పాకింది. ఎక్కడనుండి జిల్లాలోని వివిధ పట్టణాల్లో గ్రామాల్లో మండల కేంద్రాల్లో నీ వ్యాపారస్తులు ఇక్కడ కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో అధిక రేట్లకు అమ్ముతున్నారు. ఇక్కడ నుండి తీసుకుని వెళ్లిన నిత్యవసర సరుకులు కొనుగోలు చేసిన వారు ఇంటికి వెళ్లిన తర్వాత ఈ సరుకుల్లో నాణ్యత పై ముక్కున వేలేసుకుంటున్నారు. పంచదార కొనుగోలు చేసిన వారు నీటిలో వేస్తే పంచదార కరిగి ఇడ్లీ ఉప్మా రవ్వలు కిందకు చేరి ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా జీలకర్రను పరిశీలించిన మిరియాలను చూచిన ఈ పరిస్థితి ప్రజలకు ఎదురవుతుంది. వీటిపై స్థానిక వ్యాపారులను ప్రజలు ప్రశ్నించిన వారి వద్ద నుండి ఎటువంటి సమాచారం ఉండడం లేదు. తాము కూడా వివిధ ప్రాంతాల నుండి కొనుగోలు చేసి అమ్ముతున్నామని సమాధానమిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఎవరికి చెప్పాలో తెలియక తమ గ్రహ పాటు అంటూ మిన్న కుండి పోతున్నారు. ఇక్కడ నుండే జిల్లాలోని వివిధ దేవస్థానాలో జరిగే అన్నదాన కార్యక్రమాల్లో కూడా ఈ కల్తీ సరుకులు సరఫరా చేస్తున్నారు. ఆయా దేవస్థానాల్లో జరిగే అన్నదాన కార్యక్రమాలకు సరఫరా చేసే నిత్యవసర సరుకులు టెండర్ దక్కించుకుని ఈ నకిలీ వాటిని పంపుతున్నారు. ఈ టెండర్ ను తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన వ్యక్తి దేవాదాయ శాఖలో పనిచేయడంతో ఆయనే టెండర్ దక్కించుకొని ఈ నకిలీ సరుకులు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

## కలుపు మందు త్రాగి వ్యక్తి మృతి



**తాళ్ళపూడి, పెన్ పవర్, డిసెంబర్ 26:** వేగేశ్వరపురం గ్రామానికి చెందిన పడాల శ్రీరామ కుమార్(రాము) ఈ నెల 16వ తేదీన ఆర్థిక ఇబ్బందుల వలన కలుపు మందు త్రాగడం జరిగింది. ఈ నేపథ్యంలో కాకినాడ గవర్నమెంట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో మరణించడం జరిగింది. హాస్పటల్ నుండి వచ్చిన డెత్ ఇంటిమేషన్ అనుసరించి తాళ్లపూడి పోలీస్ స్టేషన్ లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## మెగా క్రీడ సంబరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే చిరి బాలరాజు





**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 26:** యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు అన్నారు. గురువారం బర్రింకలపాడు ,జీలుగుమిల్లి గ్రామాలలో మేఘ క్రీడ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుండి జనవరి 7 వరకు జరిగే ఈ క్రీడలు పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాల క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను కనపరచుకోవాలని సూచించారు. జనవరి 8వ తేదీన నా పుట్టినరోజు పురస్కరించుకొని ఈ మెగా క్రీడ సంబరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీలో క్రీడలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, విలువిద్య, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి తగిన బహుమతులు ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు జాతీయ జెండాను, క్రీడా జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేపట్టారు .ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు, పోలవరం నియోజకవర్గం జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కరాటం సాయి ,జీలుగుమిల్లి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, జిలుగుమిల్లి సీఐ బి వెంకటేశ్వరరావు, ఎస్సై పి నవీన్ కుమార్, ఏడు మండలాల కూటమి నాయకులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వంగవీటి మోహన రంగా కి నివాళు లర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**అమలాపురం టౌన్ పెన్ పవర్ డిసెంబర్ 26:** అమలాపురం నల్ల వంతెన వద్ద ఉన్న స్వర్గీయ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు వంగవీటి మోహన రంగా కి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో పేదల కోసం పోరాటం చేసిన పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా కి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుడుపూడి శ్రీనివాసరావు, జిల్లా ట్రెజరర్ సుగ్గు ప్రసాద్, పట్టణ కార్యదర్శిలు పేరి శర్మ, ముల్లెటి వెంకటేశ్వరరావు, ఏలేశ్వరపు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్

**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 26 :** సైబర్ నేరగాళ్లు రోజుకొక విధానం అనుసరిస్తున్నారని వారిపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం పెద్దాపురం డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన తనిఖీలు చేశారు. తొలుత పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలకగా, సిబ్బంది నుంచి డీఐజీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, ఈ ఏడాది సాధించిన పురోగతిని ఆరా తీశారు. అలాగే డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసుల పురోగతిపై డీఎస్పీ డి. శ్రీహరిరాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో డీఐజీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు నుంచి వచ్చిన కాల్స్‌ను నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని, వారితో ఎటువంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించవద్దని సూచించారు. పోలీసులు, సీబీఐ ఇతర నిఘా సంస్థల వ్యక్తులమంటూ సీన్ క్రియేట్ చేసి వీడియో కాల్స్ చేసినా వాటిని నమ్మవద్దన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా పాఠశాలలు, కళాశాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థతో ప్రజలతో మరింత మమేకమవుతామన్నారు. అధికారి నుంచి సిబ్బంది వరకు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా, అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ట్రైనీ డిఎస్పీ ఆర్. సుష్మిత, డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

## తరాలు మారినా తరగని ఖ్యాతి మీది.

- పినపళ్ళ సర్పంచ్ సంగీత సుభాష్.



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 26:** తలలు మారిన తరాలు మారిన తరగని ఖ్యాతి వంగవీటి మోహన్ రంగా,మాజీ మంత్రివర్యులు సంగీత వెంకటరెడ్డి(చినకాపు)లదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి,పినపళ్ళ గ్రామ సర్పంచ్ సంగీత సుభాష్ అన్నారు.వంగవీటి మోహన్ రంగా 36,వ వర్ధంతి,మాజీ మంత్రి వర్యులు సంగీత వెంకటరెడ్డి జయంతిని సంగీత సుభాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆలమూరు ముండలం పినపళ్ళ గ్రామంలోని గానుగు చెట్టు సెంటర్లో ఉన్న వంగవీటి మోహన్ రంగా, సంగీత వెంకటరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం వంగవీటి మోహన్ రంగా చేసిన పోరాటాలు వల్ల ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచే ఉంటారని సుభాష్ అన్నారు. అలాగే మాజీ మంత్రి స్వర్గీయ సంగీత వెంకటరెడ్డి(చినకాపు) ఆలమూరు శాసన సభ్యులుగా ప్రాతినిధ్యం వహించి మంత్రిగా ఈ ప్రాంతాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అటువంటి మహానీయులు అడుగుజాడల్లో యువత పయణించాలని ఈ సందర్భంగా సుభాష్ అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి పట్టాభి రామన్న, వక్కపట్ల లక్ష్మణరావు,నామాల సుబ్బారావు, యనమదల రాణి శ్రీనివాస్, పెద్దిరెడ్డి మహేష్,వంగవీటి మోహన్ రంగా, సంగీత వెంకటరెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సి.ఐల బదిలీకి రంగం సిద్ధం

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 26:** తాడేపల్లిగూడెం లో సిఐలు బదిలీ కానున్నారు. ఈ మేరకు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఇంతవరకు తాడేపల్లిగూడెం పట్టణ సీఐగా ఉన్న సుబ్రహ్మణ్యం తో పాటు రూరల్ రమేష్ కూడా బదిలీ కానున్నారు. అయితే ఇక్కడకు పట్టణ సీఐగా నాయక్, రూరల్ సీఐగా సుభాష్ బదిలీపై వస్తున్నట్లు సమాచారం. వీరిలో స్థానాల్లో మార్పు ఉండే అవకాశం ఉంది. సీఐ సుభాష్ తన పరిధిలోని గ్రామంలో ఇటీవల జరిగిన అసాంఘిక కార్యక్రమాల వల్ల విమర్శలకు గురైన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన బదిలీ తాడేపల్లిగూడెం లేక వేరే చోట అనేది కూడా తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్ సిఐలు బదిలీ అవుతారని వార్తలు పట్నంలో చక్కర్లు కొడుతున్నాయి.

## ప్రతిభా పురస్కారం అందచేసిన డా ప్రమోద్



**తాళ్లపూడి, పెన్ పవర్, డిసెంబర్ 26:** తమ గ్రామంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ పుష్కర కాలంగా తమ పితామహులు పేరున నగదు బహుమతిని, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్నారు పైడిమెట్ట గ్రామానికి చెందిన డా.జె.వి.ప్రమోద్ కుమార్. ఈ సంవత్సరం మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో గ్రామానికి చెందిన ప్రత్తిపాటి నిస్సి సాగర్ 577/600 మార్కులు సాధించగా, గ్రామంలో ఎఫిపానియా లూథరన్ చర్చి నందు జరిగిన క్రిస్టమస్ వేడుకల్లో చర్చ్ పాస్టర్ రెవ డి సుధీర్ బాబు చేతుల మీదుగా నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దున్నా దుర్గారావు మాస్టర్, జి.పాల్ రాజు, పి పుష్ప రాజు ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 26:** జగ్గంపేట మండలం రాజపూడి 33కెవి ఫీడర్ఫీడర్ నందు చెట్లు నరికివేత మరియు మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు తెలిపారు. గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. జగ్గంపేట మండలంలోని రాజపూడి, కొత్తూరు, మల్లిశాల, వెంగయమ్మపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారామపురం, జగ్గంపేట జే హెచ్ సి, బాలాజీ రైస్ మిల్ ల కు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి డిపార్ట్మెంట్ వారికి సహకరించాలన్నారు.

## సిలువ మిషన్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**తాళ్ళపూడి, పెన్ పవర్, డిసెంబర్ 26:**మండలంలోని అన్నదేవరపేట గ్రామంలోని అరుంధతీ పేటలో సిలువ మిషన్ చర్చిలో క్రిస్మస్ ఆరాధన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు సంఘ పెద్దలు, సంఘ యూత్ సభ్యులు, కొడమంచిలి జాన్ బాబు ఆధ్వర్యంలో జరిగాయి. కేకు కటింగ్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు జి.వి.ప్రసాద్, ముళ్ళపూడి శ్రీరామచంద్ర మూర్తి, కూచిపూడి హనుమంతురావు, కాకర్ల సత్యేంద్ర,కూచిపూడి గణపతి, అదిత్య, నరేంద్ర, అబ్బులు, రఘు, రాము, పల్లి ప్రకాష్, జగన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ దేవస్థానానికి వంట సామాగ్రి బహుకరణ



**పెద్దాపురం, పెన్ పవర్, డిసెంబర్ 26 :** కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో కొలువైన మరిడమ్మ అమ్మ వారి దేవస్థానానికి దాతలు వంట సామాగ్రి బహుకరించిన్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు. గండేపల్లి వాస్తవ్యరాలు పసుమర్తి సావిత్రి ఈ మేరకు వంట సామాగ్రిని అసిస్టెంట్ కమిషనర్ కు అందజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు, దేవస్థానం అర్చకులు దాతలకు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఆమెకు అందజేశారు.

## రంగా సేవలు మరువలేనివి-కరాటం రాంబాబు



**గోపాలపురం,పెన్ పవర్ డిసెంబర్ 26 :**దివంగత వంగవీటి మోహన్రంగా సేవలు మరువలేనివని మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు కొనియాడారు.నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం అనంతపల్లి ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్గీయ వంగవీటి మోహన్రంగా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఆవిష్కరణ గురువారం జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన కరాటం రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఈ ప్రాంతానికి రంగా ఏకైక శాసన సభ్యులుగా ఉండేవారన్నారు.జంగారెడ్డిగూడెంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు నేనే స్వయంగా వెళ్లి రంగాను ఆహ్వానించానన్నారు.ఇక్కడ యువజన సంఘ సభ్యులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.రంగా అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశాడని ఈ సందర్భంగా గుర్తు చేశారు.యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడాలన్నారు.మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రంగ సేవలు మరువలేనివని ఆయన ఒక వ్యక్తి కాదని గొప్ప శక్తి అని అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి,జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు,కాపు సంఘం నేతలు,రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాడి ట్రస్టుకు కలెక్టర్ అభినందనలు



**కాకినాడ.పెన్ పవర్ డిసెంబరు 26 :** ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సేవా స్ఫూర్తితో కలెక్టర్ ఆశయంతో ముందుకు వెళుతూ ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో మల్లాడి రామారావు చారిటబుల్ ట్రస్టు తరపున మార్షల్ ఆర్ట్స్, తైక్వాండో ఉచిత శిక్షణ అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం ట్రస్టు ప్రతినిధులు జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ షన్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలునుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత శిక్షణ అందచేస్తున్న ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. బాలికల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపడంతోపాటు వ్యక్తిగత వికాసాన్ని పెంపొందించడానికి ఇటువంటి శిక్షణ దోహదపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు, కోచ్ ప్రత్యూష, దుర్గాప్రసాద్ తదితరులున్నారు. తమ ట్రస్టు తరపున మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందించడానికి అవకాశం కల్పించిన కలెక్టరుకు మల్లాడి ట్రస్టు చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలియచేశారు.

# జాతి గర్వించదగ్గ దేశభక్తుడు ఉద్ధం సింగ్

- అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు



**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 26 :**స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, కాకినాడ ఐడిఎ శాఖ,
నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్దమ్ సింగ్ జయంతి వేడుకలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ , పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియజేశారు.ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, తీవ్రవాద స్వాతంత్ర్య సేనానిగా ప్రసిద్ధి పొందిన గొప్ప దేశభక్తుడు ఉద్దమ్ సింగ్ జయంతి వేడుకలు అదిత్య డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) లో జరిగాయి. ఉద్దమ్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఉధమ్ సింగ్ గదర్ పార్టీకి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు.
జలియన్వాలాబాగ్ మారణకాండకు ప్రతీకారంగా లండన్లో మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ జనరల్ ఓ డయ్యర్ ను చంపిన దేశభక్తుడు ఉద్దమ్ సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఐడిఏ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ జలియన్ వాలాబాగ్ దురాకాండ సూత్రధారి జనరల్ ఓ డయ్యర్ ను చంపి దేశభక్తిని చాటుకున్న విప్లవ వీరుడు, జాతి గర్వించదగ్గ దేశభక్తుడు ఉద్దమ్ సింగ్ అని అన్నారు. మనకి జన్మనిచ్చిన తల్లిదండ్రులు,మనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు,మనకు అన్నం పెట్టే రైతు మన దేశానికి సరిహద్దుల లో వారి ప్రాణాలు పణంగా పెట్టే జవానులే మనకు నిజమైన హీరోలని అన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన యూరాలజిస్ట్ డాక్టర్ హర్ష మాట్లాడుతూ యువత గుండెల నిండా దేశభక్తి కలిగి ఉండాలని, స్వాతంత్ర సమరయోధులను స్మరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వంగవీటి కి ఘన నివాళి





**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 26 :**స్వర్గీయ వంగవీటి మోహనరంగా 36 వ వర్ధంతి సందర్భంగా ఇమ్మిడిశెట్టి వెంకట రమణ ఆధ్వర్యంలోఅరిగెల శ్రీనివాసు(బున్నీ)ముఖ్య అతిథిగా స్థానిక శారదాంబ అమ్మవారి ఆలయం సమీపంలోని
స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో అడబాల సత్యనారాయణ, అంకమరెడ్డి రామా నాయుడు, రావిపాటి వెంకటేశ్వర్లు,తోరం చిరంజీవి, పెద్దిరెడ్డి శ్రీనివాసు, దమ్మాల గోపాల్ నాయుడు, దమ్మాల శ్రీనివాసు(చిన్న), దమ్మాల ప్రవీణ్ కుమార్,కోన శివ,డొలంకి మణికంత,కశిలంక శ్రీనివాసు, బొల్లోజు ఉమా మహేశ్వర రావు, సాక్షి రాజేష్, రామ శేఖర్,ఉల్లింగల గంగాధర నాయుడు,
దమ్మాల జగతా జననీ రావు, బాబీ నున్న, నీర్ల నాగేశ్వర రావు,రామిరెడ్డి నగేష్ చంటి ఫ్రెండ్స్ సర్కిల్, రంగా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఆ ఒక్కరోజూ మద్యం విక్రయాలు ఆపండి ప్లీజ్-కలెక్టర్ కు వినతి




**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 26 :** నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలికే క్రమంలో మద్యం ఏరులై పారుతోందని తద్వారా రోడ్డు ప్రమాదాలకు అవకాశాలు ఉన్నాయని డిసెంబరు 31న మద్యం విక్రయాలు ఆపాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగిలి కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 31 రాత్రి యువకులు మద్యం సేవించి, పెద్ద పెద్ద టెంట్లు వేసి మరీ నూతన సంవత్సరానికి స్వాగతం పేరుతో, విచిక్షణ కోల్పోయి పెద్ద, పెద్ద వాహనాలతో వీధుల్లో, మెయిన్ రోడ్ పై కేకలు వేస్తూ ఒక వాహనంపై నలుగురు ఎక్కి, మద్యం మత్తులో హారను కొడుతూ వెర్రి కేకలు వేస్తూ ప్రమాదలకు గురౌతున్నారని, అనేక మందిని ప్రమాదలకు గురించేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఆ ఒక్క రోజు మద్యం అమ్మకాలు ఆపనిమని కోరడంలో చాలా మంది యువతను ప్రమాధాల నుండి కాపాడినవాళ్ల మౌతామని అన్ని ప్రజా సంఘాలు విన్న వించడం జరిగిందన్నారు.ఈకార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక, ఆర్పీఐ, ఐద్వా, యూటీఎఫ్, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఆంధ్ర బాపిస్ట్ చర్చ్ నూరు వసంతాల వేడుక




**కాకినాడ.పెన్ పవర్ డిసెంబర్ 26 :** కాకినాడ ఎల్విన్ పేట లో సెంటినరీ ఆంధ్ర బాపిస్ట్ చర్చ్ నిర్మాణమై సరిగ్గా వందేళ్లు గడుస్తున్న సందర్భంగా చర్చ్ పాస్టర్ భాస్కర్ గేర్షోమ్, ప్రెసిడెంట్ రెయ్య రాజ్ కుమార్, సెక్రటరీ గొల్లమందల రాజేష్ ,ట్రెజరర్ వేమగిరి ఐజాక్ ప్రభాకర్, ఆధ్వర్యంలో శత జయంతివేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1874లో కెనడియన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషనరీ వారు భారత దేశంలో పలు ప్రాంతాల్లో ఈ మిషనరీ పరిచయాలను నిర్వహిస్తూ కాకినాడ ఎల్విన్ పేట లో విచ్చేసి మా సంఘం యొక్క సెంటినరీ ఆంధ్ర బాపిస్ట్ చర్చి 1924లో డిసెంబరు 26న జాన్ క్రేగ్ స్థాపించడం జరిగిందని తెలిపారు. అప్పటి నుండి పేద బడుగు బలహీన వర్గాలకి అనేక సేవా కార్యక్రమాల్లో విద్యా వైద్యం అందించే విధంగా ఈ సంఘం పనిచేయడం జరిగిందన్నారు. సుమారు అప్పుడు 46 మంది సభ్యులతో ఉన్న ఆంధ్ర బాపిస్టు సంఘానికి ఇప్పుడు300 మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ శతజయంతి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండి దాదాపు 500 మంది విశ్వాసకులు ఈ వేడుకలలో పాల్గొనడం జరుగుతుందన్నారు
ఈ కార్యక్రమానికి సీనియర్ పాస్టర్ జెఫన్యా.పీటర్.ముఖ్య.ప్రసంగీకులుగావ్యవహరించడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపిస్టు సంఘాల సభ్యులు ఎగ్జిక్యూటివ్ , సంఘ సభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహన రంగా వర్ధంతి






**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 26:**మండల కేంద్రమైన ఆలమూరులో రంగా సెంటర్ వద్ద గురువారం వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతిని మండల కాపు సంఘం అధ్యక్షులు,డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా రంగా అభిమానుల మధ్య ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ రంగా అందరివాడని,పేద, బడుగు, బలహీన వర్గాలకు రంగా అండగా నిలిచారని,ఆయన చేసిన సేవలను కొనియాడారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టులు,పళ్ళు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు రామానుజునుల శేషగిరిరావు, చల్లా నానాజీ, చల్లా భూషణం, డిపి రావు,చల్లా వెంకటేశ్వరరావు, సిరిగినేడి పట్టాభి,చిన్నం చిన్న, ఎలుగుబంటి బూరయ్య, ఎలుగుబంటి చంటి, తాకాసి తాతారావు,చల్లా ప్రభ,రాజాని సుబ్రహ్మణ్యం,తోరాటి శివ,మార్గాని వీరబాబు,బరంపురం శ్రీను,జిన్నా భాస్కరరావు,చల్లా సూర్యారావు, టీ.సత్తిబాబు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# సుముహూర్త పత్రికను సహాయ కమీషనర్ కి అందించిన వేద పండితులు

**అంతర్వేది నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం**

**సఖినేటిపల్లి, పెన్ పవర్, డిసెంబర్ 26:** స్థానిక మండలం , అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానము నందు ది. 04-02-2025 నుండి ది. 13-02-2025 తేది వరకు నిర్వహించు శ్రీ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవములకు సుముహూర్తం నిర్ణయించి ముహూర్త పత్రికను ఆలయ స్థానాచార్య , అర్చక , వేదపండిత సిబ్బంది ఆలయ సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి వారికి అందజేశారు .

సదరు ముహూర్త నిర్ణయం ప్రకారము ది.07-02-2025 వ తేది శుక్రవారం రాత్రి గం.12.55 ని.లకు శ్రీ స్వామి వారి కళ్యాణము, ది. 08-02-2025 వ తేది స్థిరవారం మధ్యాహ్నం గం.2.05 ని.లకు శ్రీ స్వామి వారి రథోత్సవము, ది. 12-02-2025 వ తేది బుధవారము ఉదయం గం.8.00 ని.లకు శ్రీ స్వామి వారి చక్రవారి (సముద్ర స్నానం) మరియు ది. 13-02-2025 వ తేది సాయంత్రం గం.06.00 ని.లకు తెప్పోత్సవం నిర్వహించబడును. సదరు కళ్యాణ మహోత్సముల సమయములో ప్రతీ నిత్యమూ శ్రీ స్వామి వారి గ్రామోత్సవములు (వాహన సేవ) జరుగును.



అలాగే కళ్యాణ మహోత్సవములు విజయవంతముగా నిర్వహించుటకు గాను తగు ఏర్పాట్లు చేయుటకు వివిధ శాఖల అధికారులతో రెవిన్యూ డివిజనల్ అధికారి అమలాపురం వారి అధ్యక్షతన ది.02-01-2025 తేది ఉదయం గం.11.00 ని.లకు సమీక్ష సమావేశము ఏర్పాటు చేశారు.

# చల్లా ప్రభాకర్ రావుకు మాతృవియోగం.



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 26:** మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన మండల కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు తల్లి చల్లా మునీశ్వరమ్మ (80) గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వారి స్వగృహం నందు మృతి చెందారు. ఈ మేరకు పలువురు మండల నాయకులు చేరుకుని కుటుంబ సభ్యులైన చల్లా నానాజీ, చల్లా భూషణములను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మృతదేహానికి నివాళు లర్పించారు. అనంతరం క్రైస్తవ సంప్రదాయంలో అంతిమయాత్రను ప్రారంభించగా భారీ సంఖ్యలో



అభిమానులు పాల్గొని ముగించారు.

# రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి-సువర్ణ రాజు



**గోపాలపురం,పెన్ పవర్, డిసెంబర్ 26:** ప్రజా నాయకులు స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగార్ల సువర్ణరాజు అన్నారు. రంగా 36వ వర్ధంతిని పురస్కరించుకుని దేవరపల్లి యర్నగూడెం గ్రామాలలో జరిగిన కార్యక్రమాలకు సువర్ణ రాజు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా పోరాటయోధుడని పేద ప్రజల హృదయాలలో ఇప్పుడు సజీవుడిగా నిలిచి ఉంటారని అన్నారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను రంగా అభిమానులు నెరవేర్చవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి ప్రసాద్, చప్పటి శివ నాగ ప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, దాసరి శేషు, కట్నం గణేష్, కనకరాజు, బల్లా రాము, గణపతి తదితరులు పాల్గొన్నారు.

# నరసింహ స్వామిని దర్శించుకున్న గుబ్బల శ్రీనివాస్ దంపతులు



**● గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్**

**సఖినేటిపల్లి, పెన్ పవర్, డిసెంబర్ 26:** స్థానిక మండలం , అంతర్వేది గ్రామములో వేంచేసియున్న నవనారసింహ క్షేత్రాలలో ప్రముఖమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల. శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి , శ్రీ స్వామి వారి దర్శనానంతరం ,వేదాశీర్వచనం అందించారు. వారి కి

సూపర్డెంట్ పి.విజయ సారధి స్వామివారి చిత్రపటం మరియు ప్రసాదాన్ని అందజేశారు

# ప్రజా నాయకులు ప్రజల హృదయాలలో ఉంటారు-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం, పెన్ పవర్,డిసెంబర్ 26:** ప్రజా సమస్యల కోసం పోరాటం చేసిన నాయకులు ఎప్పుడూ

ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఏలూరులో ఏర్పాటు చేసిన స్వర్గీయ వంగవీటి మోహన్రంగా, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వెంకటరాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే తన ఊపిరిగా పోరాటమే తన ఆయుధంగా భావించిన వ్యక్తులు రంగా,బుజ్జి అని కొనియాడారు. నేటి యువత ఆదర్శప్రాయమైన నాయకుల చరిత్రను తెలుసుకొని సమాజ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



**కాజులూరు, పెన్‌పవర్, డిసెంబర్26:** మండల పరిధిలోని తనుమళ్ల గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోతుల భవాని అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ ఎల్ శివకుమార్ మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు తమ సమస్యలను రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చన్నారు. భూ హక్కు సమస్యలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, పేరు మార్పులు, సబ్‌డివిజన్,భూ సరిహద్దులు తదితర సమస్యలకు రెవెన్యూ సదస్సు చక్కని వేదిక అని మండల తహశీల్దార్ గుర్తుచేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు భూ యజమానులు, రైతులు తప్పని సరిగా హాజరుకావాలని ఆయన సూచించారు. తనుమళ్ల గ్రామంలో సబ్ డివిజన్‌కు సంబంధించి -3 దరఖాస్తులు వచ్చాయని ఆయన మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజులూరు ఆఫీసు కంప్యూటర్ ఆపరేటర్ విశ్వనాథం,నీటి సంఘం అధ్యక్షులు పేపకాయలు బాబ్జి .మండల సర్వేయర్ మూర్తి, పెనుమళ్ళ వీఆర్వో బి.పట్టాభి,కోలంక సుబ్రహ్మణ్యం,జగన్నాదగిరి ఎం.వీఆర్వో ఈశ్వరరావు, గొల్లపాలెం వీఆర్వోలు శ్రీను, ఎస్ శ్రావణి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 33 మందిపై బైండోవర్ కేసులు నమోదు




**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 26 :** జగ్గంపేట పోలీస్ సర్కిల్ లో 33 మందిపై గురువారం బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు జగ్గంపేట సిఐ వైఆర్ కే శ్రీనివాస్ తెలిపారు. కోడి పందాలు, పేకాట, గుండాట తదితర జూదాల్లో గతంలో కేసుల్లో ఉన్న కిర్లంపూడిలో 11 మందిపై, జగ్గంపేటలో ఎనిమిది మంది పై, గండేపల్లిలో 12 మంది పై కలిపి 31 మందిపై మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద జగ్గంపేట ఎస్సై టి రఘునాధరావు, గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు ఆధ్వర్యంలో కేసులు నమోదు చేశారు. అలాగే జగ్గంపేటలో పిడిఎస్ బియ్యం తరలింపుకు సంబంధించి పాత కేసుల్లో ఉన్న ఇద్దరిపై బైండోవర్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సిఐ హెచ్చరించారు.

# క్రైస్ట్ బిలివర్స్ చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

**కాకినాడ. పెన్ పవర్ డిసెంబర్ 26 :** కాకినాడ రూరల్ నియోజవర్గం కరప మండలం




నడకుదురు గ్రామంలో పూర్ణ ఫంక్షన్ హాల్ నందు క్రైస్ట్ బిలివర్స్ చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెవరెండ్. ఫాదర్. మేడపాటి రాజ్ కుమార్, ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వర్యులు కురసాల కన్నబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్న బాబు మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ ను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ అని , క్రీస్తు చూపించిన మార్గంలో నడుచుకుంటూ ప్రతి వారు తమ సాటి వారి పట్ల ప్రేమ తత్వంతో మెలగాలన్నారు. ముఖ్య వర్తమానికులుగా హైదరాబాద్ నుండి విచ్చేసిన ఎండ్ టైమ్స్ బైబిల్ కాలేజీ ప్రిన్సిపాల్ రెవ జి పి జాస్పర్ గారు క్రీస్తు రాక పరమార్ధన్ని గురించి అద్భుతమైన క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి, ఈ కార్యక్రమంలో మాజీ కరప మండల వైస్ ఎంపీపీ యాసలపు దుర్గాప్రసాద్, మాజీ ఎంపీటీసీ పబ్బినీడి చక్ర రావు, మాజీ సొసైటీ డైరెక్టర్ యడ్ల కృష్ణార్జున, పులిదిండి బాల సుబ్రహ్మణ్యం, దైవ జనులు ఫాధర్ మేడపాటి కృపావరం, ఫాదర్ సువర్ణ రాజు, బ్రదర్ థామస్ మరియు అధిక సంఖ్యలో బిలీవర్స్ చర్చ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సోమరాజు మృతి పార్టీకి తీరని లోటు - ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవర్, డిసెంబర్ 26:** టిడిపి సీనియర్ నాయకుడు పంది సోమరాజు మృతి పార్టీకి తీరని లోటు అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కొనియాడారు. మండలంలోని సాగిపాడు గ్రామానికి చెందిన పంది సోమరాజు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి పుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ఆయన అంత్యక్రియలు కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ పార్టీకి విశేష సేవలు అందించిన ఒక నాయకుడి పాడిని ఎమ్మెల్యే వెంకటరాజు స్వయంగా మోసి ఆ పార్టీ నాయకుడి పై తనకున్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్లపాటి రాము, మద్దిపాటి రమేష్, జ్యేష్ట శ్రీనివాసరావు, వేముల నాగరాజు, బెజవాడ మోహన్రావు తదితరు పాల్గొన్నారు.

# నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి





**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 26:** ఆలమూరు మండలం చింతలూరు గ్రామంలో వేంచేసి ఉన్న నూకాంబికా అమ్మవారి ఆలయానికి కొత్త కళ వచ్చిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రారంభోత్సవ,శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే సత్యానందరావుకు ఆలయ అధికారులు,గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో సిజిఎఫ్ మ్యాచింగ్ గ్రాంట్లు రూ.1.60 కోట్లతో నూతనంగా నిర్మించిన ముఖ మండపం,ప్రాకార మండపాలను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. అలాగే దాత,ఎన్నారై దాసరి గణేశ్వరరావు సహకారంతో రూ.32 లక్షలతో నిర్మించనున్న తూర్పు రాజగోపురం, భక్తుల సహకారంతో రూ. 32 లక్షలతో నిర్మించనున్న పడమర రాజగోపురం, దాతలు గన్ని నారాయణరావు,గన్ని వెంకట్రావు సహకారంతో రూ. 2.8 లక్షలతో నిర్మించనున్న గనిపోతురాజు ఆలయం,కర్ణాటక వాస్తవ్యుడు దాత దాసరి అమ్మిరాజు సహకారంతో రూ.11.50 లక్షలతో నిర్మించనున్న షెడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. భక్తులు రూ. 40 లక్షలతో అమ్మవారికి సమకూర్చిన వెండి ఆభరణాలు,రూ. లక్షతో దాతలు చేయించిన బంగారు ఆభరణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా విజయంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. శోభాయమానంగా వెలుగుతున్న నూకాంబికా అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి స్థాయిలో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు,సేవలు అందించేందుకు కృషి చేస్తానని సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్డీఏ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుంతలు లేని రహదారులను ప్రయాణికులకు అందించడమే లక్ష్యం.

ఎమ్మెల్యే సత్యానందరావు.



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 26:**గుంతలు లేని రహదారులను సంక్రాంతి పండుగ వచ్చే ముందు ప్రయాణికులకు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ నుండి వెదురుమూడి రహదారి మరమ్మతు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ చేతకాని పాలనతో రహదారులు అధ్వానంగా మారాయని అన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మన ప్రజా ప్రభుత్వం అయిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా అభివృద్ధి చేస్తూ తక్షణం ప్రజా రవాణాకు గుంతలు లేని రోడ్లను ప్రజలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆ దిశగా పనులు వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. సంక్రాంతి పండుగకు ముందుగా గుంతలు లేని రోడ్లను ప్రయాణికులకు అందిస్తామని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

**కాజులూరు, పెన్‌పవర్, డిసెంబర్26:**మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జె.రాంబాబు మీడియాకు తెలిపారు. డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి స్థాయిసమాచారంతో తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై అజెండా ఉంటుందన్నారు. అధికారులు, సభ్యులు హాజరు కావాలని సూచించారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ధవళేశ్వరం, బొబ్బర్లంక గ్రామస్తులతో డీఎస్పీ గోవిందరావు



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 26:**ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక - ధవళేశ్వరం సరిహద్దుల్లో కాటన్ బ్యారేజి వద్ద మత్స్యకారులు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చేపలు, రొయ్యల సీడ్ వేట సాగించాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అన్నారు .

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.వి.కృష్ణారావు ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ కార్యాలయంలో గురువారం బొబ్బర్లంక, ధవళేశ్వరం గ్రామాలకు చెందిన ఫిషర్ మేన్ సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల వారితో పోలీసులు చర్చించారు. రొయ్యల సీడ్ వేట కోసం ఘర్షణలు పడకుండా ఎవరి పరిధిలో వారు వేట సాగించాలని సూచించారు. ఏదైనా సమస్య ఉన్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివాదాలు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వివాద పరిష్కారం కోసం తదుపరి సమావేశంలో చేపల వేట, రొయ్యలు వేటకు సంబంధించి సూచనలు ఇస్తామని అప్పటివరకు శాంతియుతంగా వేట సాగించాలని సూచించారు.

ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ప్రవర్తించినట్లయితే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రావులపాలెం రూరల్ సిఐ, సి.హెచ్.విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము ఆత్రేయపురం తహశీల్దార్ రాజేశ్వరరావు, ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందేలు, జూదాలకు పాల్పడితే చర్యలు తప్పవు



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 26:** రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జగ్గంపేట సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, గుండాట, వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు అన్నారు. పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్, జగ్గంపేట ఎస్ ఐ టి. రఘునాథరావు గురువారం గతంలో కోడిపందాలు నిర్వహించిన ప్రదేశాలతో పాటు, అనుమానిత ప్రదేశాలైన జగ్గంపేట శివారు బాలాజీ నగర్ దగ్గరలోని ప్రదేశం, కాట్రావులపల్లి, రాజపూడి గ్రామాల్లోని మామిడి తోటలను, ఖాళీ ప్రదేశాలను పరిశీలించారు. యువకులతో మాట్లాడి ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం అందించాలని కోరారు. పోలీస్ నిబంధనలకు వ్యతిరేకంగా చట్ట వ్యతిరేక జూదాలు, కోడి పందాలు నిర్వహిస్తే నిర్వాహకులతో పాటు భూ యజమానులపై కూడా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట రెవెన్యూ ఇన్స్పెక్టర్ వడ్డీ శ్రీనివాసరావు, విఆర్వోలు వీర్రాజు, సత్య కుమార్, అప్పారావు, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శిరోమండనం ,బాధితులకు, న్యాయం చేస్తారా?





- బెయిల్ రద్దుకు ప్రభుత్వం క్రాస్ అపీల్ వేయాలి
- విదసం డిమాండ్

**అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, డిసెంబర్ 26:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా కోనసీమలో అధికారులు వైసిపి ఎమ్మెల్సి తోట త్రిమూర్తులు కే కొమ్ము కాసే వైఖరి మారలేదని అట్రాసిటీ కేసు లో నిందితులను కాపాడే అధికారుల పై సెక్షన్ 4 ప్రకారం చర్యలు తీసుకోవాలని విదసం ( విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండ్ చేసారు

సంచలన అట్రాసిటీ కేసు వేంకటాయి పాలెం శిరో మండన%శీ% కేసులో బెయిల్ మీదున్న తోట త్రిమూర్తులు పై ప్రభుత్వం తరఫున హై కోర్టు లో తక్షణమే క్రాస్ అప్పీల్ వేయాలని భాదితులుతో విదసం ప్రతినిధులు కలెక్టరును కలిసి వినతపత్రం అందజేశారు

అనంతరం బూసి వెంకట రావు మాట్లాడుతూ 1996లో వేంకటాయి పాలెం దళితులకు తోట త్రిమూర్తులు శిరో మండన%శీ% చేసిన కేసులో త్రిమూర్తులు , అతని సోదరులకు 18 నెలలు జైలు శిక్ష పడిందని ఈ శిక్షను రద్దు చేయాలని త్రిమూర్తులు ఏప్రిల్ నెలలో హైకోర్టులో అప్పీలు వేశారని ఈ అప్పీల్ ను ఛాలెంజ్ చేస్తూ క్రాస్ అప్పీల్ వేయాల్సిన పోలిసు అధికారులు వైసీపీ నాయకుడు తోట త్రిమూర్తులు కొమ్ము కాసి బాధిత దళితులకు అన్యాయం చేశారని విమర్శించారు

బాదితుల పిల్లలకు కేస్టు సర్టిఫికెట్లు మంజూరులోనూ రెవిన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు

త్రిమూర్తులు అప్పేల్ పై హైకోర్టు నుండి పోలీసు అధికారులకు ఏప్రిల్ నెలలో నే సమాచారం వచ్చినా నేటికి 8 నెలలు గడిచినా త్రిమూర్తులు కు వ్యతిరేకంగా కోర్టు ప్రక్రియ చేపట్టలేదన్నారు .. ఇది పూర్తిగా ముద్దాయి తోట త్రిమూర్తులు ను జైలు శిక్ష నుండి కాపాడటానికి అదికారులు పన్నిన కుట్ర కాదా అని ప్రశ్నించారు..

ఇక్కడ త్రిమూర్తులను , కాకినాడలో రేషన్ అక్రమార్కులను , మచిలీ పట్నం లో పేర్ని నాని ని కాపుడుతున్నది వైసిపి అనుకూల అధికారులే అని ఎత్తి చూపారు...

ఇప్పటికైనా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ చైర్మన్ కలెక్టరు చర్యలు తీసుకుని తక్షణమే క్రాష్ అప్పీల్ వేసి త్రిమూర్తులను జైలుకు పంపాలని, నేరస్తులకు కొమ్ము కాసే అధికారులపై సెక్షన్ 4 కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

రేవు తిరుపతి రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుబ్బల శ్రీనివాస రావు, వెంటపల్లి రామకృష్ణ బూల భాస్కర రావు, మూర మహేశ్, పాలమూరి మోహన్ ,బడుగు జోగేష్, శెట్టి బత్తుల తులసి రావు అమల దాసు బాబురావు కోటి చిన రాజు తదితరులు పాల్గొన్నారు..

## కట్నం కోసం వేధిస్తున్న భర్త పై కేసు నమోదు,

**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 26:** అధనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త పై కేసు నమోదు చేసిన సంఘటన అంకంపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలో అంకంపాలెం గ్రామానికి చెందిన కాయల సునీత కు 2021 సం లో అదే గ్రామానికి చెందిన కాయల అనిల్ కుమార్ తో ప్రేమ వివాహం జరిగినది. వీరికి ఒక కుమారుడు 3 సం, కాయల సునీత గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తుంది . తన భర్త కరెంట్ వర్క్ చేస్తున్నాడు. సునీత భర్త మద్యానికి బానిసై భార్యను అదనపు కొట్టడం కోసం వేధించడంతో గురువారం ఆత్రేయపురం స్టేషన్ ఫిర్యాదు చేయగా స్టేషన్ ఎస్ఐ ఎస్ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## ఎస్సీ కుల గణన జాబితా విడుదల

**కాజులూరు, పెన్‌పవర్, డిసెంబర్26:** మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయంలలో ఎస్సీ కులాలకు సంబంధించి సోషల్ ఆడిట్ ప్రచురణ చేయడం జరగిందని గురువారం మండల తహశీల్దార్ శివకుమార్ తెలిపారు. ఎస్సీ కులగణన జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉంటూ సంబంధిత కుల పెద్దలు సదరు జాబితాను పరిశీలించాలని సూచించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోపు స్థానిక వీఆర్వోకు రిపోర్టు చేయాలని సూచించారు. జిల్లాకలెక్టర్ ఆదేశాలమేరకు జాబితా విడుదల చేసి అన్ని గ్రామ సచివాలయంలలో పెట్టడం జరిగిందన్నారు. కావున ప్రతీ ఒక్కరూ జాబితా పరిశీలించాలని సూచించారు.

## రాష్ట్రస్థాయి నెట్ బాల్ కు ఎంపికైన ఆత్రేయపురం మండల విద్యార్థులు



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 26:** రాష్ట్రస్థాయి నెట్ బాల్ లో విజేతలుగా నిలిచిన

ఆత్రేయపురం మండల విద్యార్థులు కర్నూలు జిల్లాలో డిసెంబర్ 21, 22, 23 తేదీలలో జరిగిన 10వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో ఆత్రేయపురం మండల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. 1. తమ్మి రంజిత్ కుమార్ 9వ తరగతి మహాత్మా గాంధీ హై స్కూల్. 2. కడలి సత్య కుమార్ 8వ తరగతి మహర్షి విద్యానికేతన్3. అత్తిలి హర్ష వర్ధన వెంకటరమణ 8వ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెర్లపాలెం. 4. కల్లూరి ఆదినారాయణ 10వ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లొల్ల 5. కాకులపాటి కమల వెంకటేష్ పదవ తరగతి లొల్ల ఆత్రేయపురం మండల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు పి .వరప్రసాద్ , పి.సాహెబ్

మహాత్మా గాంధీ సంస్థల డైరెక్టర్ పి.ఎస్. రాజు.

మహర్షి విద్యానికేతన్ డైరెక్టర్ ఎన్ .వి .రామరాజు ,పి ఇ టి

నంబూరి రవిరాజు, ఉపాధ్యాయులు , గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

## 29 న శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి వారి దివ్య కల్యాణం

**అమలాపురం టౌన్, పెన్ పవర్, డిసెంబర్ 26:**

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ వాస్తు, జ్యోతిష్య, ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ పర్యవేక్షణలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం సత్య సాయి కళ్యాణ మండపంలో ది.29.12.2024 ఆదివారం ఉదయం గం.9.30 ని. కు లోక కళ్యాణార్ధం శ్రీ అనంతలక్ష్మి సత్యవతీదేవి సమేత శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం, శ్రీ అన్నపూర్ణా అమ్మవారి అష్టోత్తర శత నామ పూజ నిర్వహించబడుచున్నది. సంకల్పము, గణపతి పూజ చేసి, స్వామివారి కళ్యాణములో పీటలపై కూర్చొన దలచినవారు ఈ నెల 28వ తేదీ లోపల పేర్లు నమోదు చేసుకోవాలి. వీరితో పాటు, కళ్యాణమును వీక్షించుటకు వచ్చు భక్తులు అందరికి ప్రవేశం ఉచితమని, ఏ విధమైన పూజా రుసుములు, దక్షిణలు, హుండీలు ఉండవని, అందరూ ఆహ్వానితులే అని నిర్వాహకులు కుమార్ శంకర్ గౌడ్, గోరుగంతు సీతారామం, ఆర్. లోకేష్ తదితరులు తెలియజేసి, యావన్మంది భక్తులు విచ్చేసి తీర్థ, ప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరారు. వివరాలకు సెల్ నెం. 9849607052 ని సంప్రదించవలెను.




## కరప పోలీసు స్టేషన్ రికార్డులు తనిఖీచేసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్



**కరప పెన్ పవర్ డిసెంబర్ 26:** స్థానిక పోలీసు స్టేషన్ ను గురువారం ఏలూరు రేంజ్ జీవీజీ అశోక్ కుమార్ సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీసు స్టేషన్ ను ఆయన సందర్శించి, రికార్డుల నిర్వహణను, పరిసరాలను పరిశీలించి, పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ కు ఎక్కువగా ఎటువంటి ఫిర్యాదులు వస్తున్నాయి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఐజీ ఆరాతీశారు. మండలపరిధిలోని గ్రామాల్లో నేరాలను అదుపుచేసేందుకు రాత్రిసమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆయన సూచించారు. క్రైమ్ రేట్ పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలను ఆయన స్టేషన్ సిబ్బందికి వివరించారు. వచ్చేసంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందాలు, గుండాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ఐజీ అశోక్ కుమార్ కు కరప ఎస్ఐ టి.సునీత పుష్పగుచ్ఛమిచ్చి, స్వాగతం పలికారు. తర్వాత పోలీసుస్టేషన్ సిబ్బంది నుంచి ఐజీ అశోక్ కుమార్ గౌరవవందనం స్వీకరించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, ట్రైనీ ఎస్పీ, ఇన్ఛార్జ్ డీఎస్పీ, సీఐ తదితరులు పాల్గొన్నారు.

# జైలు నిర్మాణానికి స్థల పరిశీలన

**విజయనగరం క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 26** :విజయనగరం జిల్లాలో జిల్లా జైలు నిర్మాణానికి డిసెంబరు 26న స్థల పరిశీలన చేసినట్లుగా జైళ్ల శాఖ కోస్తాంధ్ర డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ తెలిపా రు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జై లు నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు గా కోస్తాం ధ్ర జైళ్లశాఖ డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ తెలిపారు. ఇందులో భాగంగా విజయనగరం మండలం సారిక గ్రామ సమీపంలో అందుబాటు లో ఉన్న 7 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలిం చారు. జైలు నిర్మాణానికి 10 ఎకరాల విస్తీర్ణంలో స్థలం అవసరం కాగా, సారిక గ్రామం సమీపంలో 7 ఎకరాల ప్రభుత్వ స్థలం మాత్రమే అందుబా టులో ఉందన్నారు. జైలు నిర్మాణంకు సదరు స్థలం అనుకూలంగా ఉందో లేదో అని పరిశీలన కు రాజమండ్రి నుండి విజయనగరంకు కోస్తాంధ్ర జైళ్లశాఖ డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ విచ్చేసినట్లు గా తెలిపారు.

డీ.ఐ.జీ ఎం.ఆర్.రవికిరణ్ తోపాటు జిల్లా సబ్ జైళ్ల శాఖ ఇంఛార్జి ఎస్.శివప్రసాద్, సబ్ జైల్ పర్యవేక్షణ అధికారి బి.సంపత్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## కూటమి సర్కార్ కి వినయ పూర్వక అభ్యర్ధన-

● దా ఇండియన్ మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకు లు జీవీఎల్ పద్మ






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, డిసెంబర్ 26** :దక్షిణ నియోజకవర్గం ద్వారకా నగర్ జీ.వీ.ఎం. సీ. కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్ర హం దగ్గర ద ఇండియన్ మహిళా ఫౌండేషన్ కార్యవర్గం గురువారం సాయంత్రం పత్రిక సమా వేశం నిర్వహించారు. సమావేశంలో జి.వి.ఎల్ పద్మ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద పండుగని, పండుగ సమయాలలో విడుదలయ్యే సినిమాలకు అద నపు షోలు అని రేట్లు భారీగా పెంచడం సరికాద ని పక్క రాష్ట్రం తెలంగాణలో సీ.ఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలను మేము స్వాగతిస్తున్నామని ఆమె అన్నారు. అలాంటి నిర్ణయాలే ఎ.న్డీ.ఏ కూటమి ప్రభుత్వం కూడా తీసుకొని ప్రజలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు ద ఇండియన్ మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జీవీఎల్ పద్మ. పేదోడికి వినోదం ఒకటే అందుబాటులో ఉందని అవి కూడా రేట్లు పెంచి పేదోడి సంతోషా నికి భారం కాకూడదని విజ్ఞప్తి చేశారు. మరియు తెలంగాణ రాష్ట్రంలో పుష్ప 2 సినిమా విడుదల రోజు జరిగిన ఘటనాల మరో ఘటన పునరావృతం కాకూడదని ఆమె కూటమి సర్కార్ ని వినయ పూర్వకంగా కోరారు .

## అత్యవసర రక్తదాన శిబిరం

నేటి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి





**పాడేరు,పెన్ పవర్ డిసెంబర్ 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో గల స్థానిక కాపీ హౌస్ లో నేడు శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని తామంతా హాజరై విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఎస్పీ ప్రమోద్ కుమార్ లను రెడ్ క్రాస్ బృందం కోరారు. జిల్లాలో రక్తపు నిలువలు లేకపోవడంతో అత్యవసర సమయంలో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దానిని అధిగమించేందుకు జిల్లా కలెక్టర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్,రెడ్ క్రాస్ చైర్మన్ అభిషేక్ గౌడ్,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశాల మేరకు అత్యవసర రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అన్ని శాఖల ఉద్యోగులు సహకరించాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అపోహలకు తావు లేకుండా విరివిగా దాతలు ముందుకు రావాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కి సహకరించి రక్తదాన శిబిరాలు విరివిగా ఆయా శాఖాలవారీగా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.వైద్యం అందక రక్తపు నిలువలు లేక స్థానిక గిరిజన రోగులు మృత్యువాత పడకుండా రక్త దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆకాంక్షించారు.అలాగే సభ్యత్వ నమోదు చేసుకుని రెడ్ క్రాస్ సొసైటీ కి విరాళాలు అందించాలని దాతలకు కోరారు.జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సహాయ సహకారాలతో నూతన కార్యవర్గం ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రజలందరూ సహకరించి రెడ్ క్రాస్ సొసైటీని ఏజెన్సీలో మరింత బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగరాజు,కోశాధికారి సూర్యారావు, సభ్యులు రవి, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్, తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి లో వంగవీటి మోహన్ రంగా 33 వ వర్ధంతి.

కాపునాడు సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ.



**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 26:-** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహనరంగా 36 వ వర్ధంతిని చింతపల్లి కాపుసంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడు దూనబోయిన రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం చింతపల్లి మండల అధ్యక్షులు గాజుల శ్రీను, తాటిపాకల హరి, దూనబోయిన నాగు, తరుణ్, లోవ, దివాణం, స్వామి తదితరులు పాల్గొన్నారు,

# స్టీల్ కార్మికులకు తక్షణం వేతనం చెల్లించాలి

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం డిసెంబర్ 26.** :విశాఖ స్టీల్ కార్మికులకు తక్షణం వేతనం చెల్లిం చాలని స్టీల్ సి ఐ.టి.యు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ యాజమాన్యంన్ని డిమాండ్ చేశారు. నేడు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ఉ క్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జె అయోధ్య రామ్ మాట్లాడుతూ నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు దేశ ప్రధాని మోడీ గారిని కలిసి భూసేకరణ చేయని ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ కు ముడి ఖనిజం కావాలని ప్రశ్నించడం హాస్యాస్పదమని ఆయన తీవ్రంగా విమర్శించా రు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 300 మిలియన్ టన్నుల దేశ సామర్థ్యాన్ని పెంచే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని ఆయన వివరించారు. విశా ఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుతామని ప్రకటనలతో నే కాలం గడుపుతున్నారని ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆయన అన్నారు. ఇప్పటికే గత నెల మీరు ఇచ్చిన సా మర్థ్యానికి కార్మికులు కష్టించి పనిచేసే సాధించారని, అదే సమయంలో ఈనెల కూడా అది సాధిస్తున్న కార్మికులను పస్తులుపెట్టి జి ఎస్ టి రూపంలో 380 కోట్ల రూపాయలను ప్రభుత్వం ముక్కు పిండి తీసుకుంటోందని ఆయన వివరిం చారు. కార్మికుల వేతనాలు పెట్టుబడిగా పెట్టి నేడు ప్రభుత్వం, యాజమాన్యాలు వ్యవహరిస్తు న్నాయని కనుక కార్మికులకు న్యాయంగా చెల్లిం చాల్సిన వేతనాలు తక్షణం చెల్లించాలని ఆయ న డిమాండ్ చేశారు.స్టీల్ సి.ఐ.టి.యు అధ్యక్షు లు వైటి దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ యాజమా న్యాల వైఖరిని ప్రశ్నించాల్సిన స్థానిక ప్రజా ప్రతి నిధులు మౌనం వహించడం కార్మికుల దౌర్భా గ్యం అని ఆయన విమర్శించారు. కనుక ఈ సమయంలో ప్రజా ప్రతినిధులు మౌనం వీడి కార్మికులను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ స్టీల్




ప్లాంట్ దగ్గర ఉన్న భూములను స్టీల్ ప్లాంట్ కు బదలా యిస్తే తన సొంత కాళ్లపై నిలబడి లాభాలు ఆర్జిస్తుం దని ఆయన అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుతామంటే దీనిని సెయిల్ లో విలీనం చేసి, సొంత గనులను కేటాయించడమే సరైన మార్గమని ఆయన వివరించారు. కనుక ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి తగిన నిర్ణయాన్ని తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, టివికె రాజు, డి.ఎస్.ఆర్.సి మూర్తి, మరిడయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీరామచంద్ర మూర్తి, ఎమ్ ఎస్ రాజు తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొ న్నారు.

# ఎస్.హెచ్.జి మేళాకు విశేష స్పందన



● జీ.వీ.ఎం.సీ ప్రాజెక్టు డైరెక్టర్ (యు. సి. డి) పి.ఎమ్.సత్యవేణి



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం డిసెంబర్ 26** : సంజ ఉత్సవ్-ఎస్ హెచ్ జి మేళాకు విశేష స్పందన ప్రజల నుండి లభించిందని జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్ (యు సి డి) సత్యవేణి గురువా రం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో జీ.వీ.ఎం.సీ మరియు మెప్మా ఆధ్వర్యంలో ఎంవిపి కాలనీ ఏఎస్ రాజా కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్న సంజ ఉత్సవ్ - 2024 ఎన్ హెచ్ జి మేళాకు 2వ రోజు ప్రజల నుండి విశేష ఆదరణ లభించిందని, డిసెంబర్ 25 బుధవారం ప్రారంభించిన రోజే సుమారు ఏడు లక్షలు విలువ చేసే వస్తు, వస్త్ర, ఆహార,ఇతర ఉత్పత్తులు అమ్మకం జరిగిందని, గురువారం 2 ,3 ,8 జోన్ లకు సంబంధించిన స్వయం సహాయక సంఘాల సభ్యులు, నగర ప్రజలు సుమారు పదివేల మంది వరకు మేళా లో ని స్టాల్స్ ని సందర్శించారని, గురువారం సాయంత్రానికి సుమారు 10 లక్షల రూపాయలు అన్ని రకాల ఉత్పత్తుల అమ్మకాలు జరిగాయని ఆమె తెలిపారు. ఈ మేళా మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు, వారి ఆర్థిక పరిపుష్టికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. నగర ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎస్ హెచ్ జి మేళాను సందర్శించి స్వయం సహాయ క సంఘాలకు సహకరించి వారిని ప్రోత్సహించా లని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేళాలో నిత్యం వినోదం కోసం వినోద, సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించడం జరుగుతుందన్నారు.





## ప్రమాదాల హరికట్టేందుకు జిల్లా రవణాధికారి లీల ప్రసాద్

పొగమంచు ప్రమాదాల పట్ల అప్రమత్తత వహించండి



**పాడేరు,పెన్ పవర్ డిసెంబర్ 26:**ప్రస్తుత శీతాకాలంలో చలితోపాటు విపరీతమైన పొగమంచు వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, పొగమంచు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణా శాఖాధికారి లీలా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.వీటిని నివారించడానికి పొగమంచులో ప్రయణాన్ని వాయిద వేసుకోవాలని సూచించారు.ఒకవేళ తప్పనిసరిగ ప్రయనించ వలసి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయానికులను విజ్ఞప్తి చేసారు. ముఖ్యంగా రోడ్డు మార్గంలో ఎడమవైపు మాత్రమే ప్రయాణిచలని, మంచువలన మార్గం కనిపించకపోతే,మార్గం కనిపించేవరకు వేచి వుండాలని సూచించారు. వాహన వేగాన్ని తగ్గించి నడపాలని,హజార్డౌస్ లైట్స్ ఆన్ చేసి ఉంచాలని,హెడ్ లైట్స్ లో (తక్కువ) బీం లోనే వెలిగించాలని,మలుపు తిరగడానికి 10 సెకండ్ల ముందే ఇండికేటర్ వేయాలిని, విండ్షీల్డ్,రియర్ మిర్రర్ ను క్లీన్ గా ఉంచాలని,ప్రయాణానికి సరిపడు సమయాన్ని కేటాయించుకోవాలని సూచించారు.అదేవిధంగా సడన్ బ్రేక్ వేయరాదని,రోడ్ మార్జిన్ గమనిస్తూ వాహనము నడుపాలని, ఘాట్ రోడ్ లొ 40 కిలోమీటర్స్ మించి వాహనము నడుపరాదనీ, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ తప్పనిసరిగ ధరించాలని ఆయన విజ్ఞప్తి చేసారు.రాంగ్ పార్కింగ్ చేయరాదని, తప్పనిసరి పరిస్థితిలొ ఇండికేటర్ వేసివుంచాలని, మత్తు పదార్థాలు సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనము నడుపరాదని కోరారు

# లోన్ యాప్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చెయ్యాలి



● వార్షిక తనిఖీల్లో భాగంగా గంట్యాడ పోలీసు స్టేషను సందర్శించి
● పోలీసు స్టేషను పరిసరాలు, ప్రాపర్టీ రూం, లాకప్ సెల్స్, సీజ్ద్ వాహనాలను పరిశీలించి
● పోలీసు స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్






**విజయనగరం క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 26** :మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బందితో మమేకమై,వారు నిర్వహిం చాల్సిన విధులపై దిశా నిర్దేశం చేసిన జిల్లా వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,డిసెంబరు 26న గంట్యాడ పోలీసు స్టేష ను సందర్శించి, స్టేషను పరిసరాలు, లాకప్ సె ల్స్, ప్రాపర్టీ రూంను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మహి ళా సంరక్షణ పోలీసులు, పోలీసు సిబ్బందితో మమేకమై, వారికి దత్తతగా అప్పగించిన గ్రామా ల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, భూతగదాలు, గొడవలు, వివిధ రాజకీయ పార్టీ ల వైరంలు, పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగి న వ్యక్తుల పేర్లు, గంజాయి అక్రమ రవాణా, విక్ర యాలు, వినియోగం గురించి సమాచారం సేక రించి, ఉన్నతాధికారులకు అందజేయాలన్నా రు. ప్రతీ వారం విధిగా దత్తత గ్రామాల్లో పోలీసు లు సందర్శించాలని, ప్రజలకు లోన్ యాప్ మోసాలు, సైబరు మోసాలు, డిజిటల్ అరెస్టు, మహిళల భద్రత, రహదారి భద్రత పట్ల క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశిం చారు. ఎవరైనా సైబరు మోసానికి గురైతే 1930 కు ఫిర్యాదు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహ న కల్పించాలని పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

పోలీసు సిబ్బంది సమస్యలను జిల్లా ఎస్పీ అడి గి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మాదక ద్రవ్యాల వలన కలిగే అన ర్థాలను ప్రజలు, విద్యార్థులకు “సంకల్పం” కార్య క్రమంతో అవగాహన కల్పించాలని ఆదేశించా రు.గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే వి ధంగా చర్యలు చేపట్టాలని, సీ.సీ కెమెరాల ఏ ర్పాటులో స్థానిక వ్యాపారులు, ప్రజల సహకా రం తీసుకోవాలన్నారు.రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద కాషనరీ బోర్డులను, స్టాపర్స్, లైటింగ్ ఏర్పాటు చేసి, ప్రమాదల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.అనంతరం, పోలీసు స్టేషనులో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులు, వివిధ న్యా య స్థానాల్లో ట్రయల్స్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడీ ఫైల్స్ ను జిల్లా ఎస్పీ పరిశీలించి, కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేసారు.స్టేషను పరిధిలో ఎటువం టి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చ ర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థను మె రుగు పర్చుకోవాలని, సమాచార సేకరణకు, ఎం.ఎస్.పి దత్తత గ్రామ పోలీసుల సేవలను సమర్థవంతంగా వినియోగించు కోవాలన్నారు.

రోడ్డు భద్రత నియమాలు ప్రతీ ఒక్కరూ పాటిం చాలని కోరారు. చాలా ప్రమాదాలు హెల్మెట్ ధరించని కారణంగా తీవ్రంగా గాయపడి, ప్రాణా లు కోల్పోతున్నారు. కావున, ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పించాల న్నారు. గంట్యాడ పోలీసులకు జిల్లా ఎస్పీ వకు ల్ జిందల్ హెల్మెట్స్ అందజేసి, తప్పనిసరిగా హెల్మెట్స్ ధరించాలని, హెల్మెట్ బరువు కాదు, బాధ్యతగా భావించాలన్నారు.వివిధ స్టేషన్ రికార్డ్స్, జనరల్ డైరీ, పార్టు 1-5 రికార్డ్స్, హిస్ట రీ షీట్స్, ప్రాసెస్ రిజిష్టరు, ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్, కేడి చెక్ రిజిష్టరు, క్రైమ్ చార్ట్, క్రైమ్ ఆబ్స్ట్రా క్ట్,బీట్ బుక్స్ లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తనిఖీ చేసారు.

ఈ వార్షిక తనిఖీల్లో విజయనగరం డి.ఎస్పీ ఎం.శ్రీనివాసరావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్ని సి.ఐ ఏవి లీలారావు, గంట్యాడ ఎస్సై సా యి కృష్ణ మరియు ఇతర పోలీసు అధికారు లు, ఎం.ఎస్.పి.లు, దత్తత పోలీసులు పాల్గొన్నారు.



# కులగణన పై సామాజిక సర్వే

- సచివాలయాల పరిధి లో
- జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, డిసెంబర్ 26** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలపై సమీక్ష చేసేందుకు, పథకాలు అమలు చేసేందుకు, మెరుగైన పాలసీ రూపకల్పన కోసం నిర్వహించి న కులగణనపై గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సామాజిక సర్వే(సోషల్ ఆడిట్)ను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. ఈ నెల 26వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో సోషల్ ఆడిట్ జరుగు తుందని, ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ కూడా ఉంటుందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగు ణంగా ప్రతి సచివాలయం పరిధిలో సంబంధిత కులగణనకు సంబంధించిన జాబితాలను ప్రచు రించాలని ఈ మేరకు అధికారులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్26వ తేదీన కులగణనకు సంబందించిన సర్వే డేటాను సచి వాలయాల్లో ప్రచురించాలని, 26 నుంచి 31వ తేదీ వరకు ప్రజల నుంచి లేదా థర్డ్ పార్టీ నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, అభ్యంతరాల వివరాలను అధికారులు ఆన్‌లైన్ చేయాలని, తదనంతరం డేటా ధృవీకరణ చేసి జనవరి 10న తుది కులగణన సర్వే డేటా ప్రచురించాల ని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంబంధిత అధికా రులు, సిబ్బంది ఈ ప్రక్రియలో బాధ్యతాయుతం గా వ్యవహరించి సోషల్ ఆడిట్ షెడ్యూల్ ప్రకా రం క్రమ పద్ధతిలో వైఫల్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. మండల ప్రత్యేకాధికారులు ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని చెప్పారు. సోషల్ ఆడిట్ నిర్వహణకు సంబంధించి జేసీ సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వ హించి మార్గదర్శకాలు జారీ చేయగా, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, సచి వాలయాల నోడల్ అధికారి ఉషారాణి సచివాలయ సిబ్బం దికి, రెవెన్యూ సిబ్బందికి ప్రక్రియ నిర్వహణ, ఇతర అంశాలపై ఆన్లైన్ శిక్షణ అందజేశారు.

## సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ వాలంటీర్ల దీక్ష




**పెన్ పవర్,** అరకులోయ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద 26బీ27బీ28 మూడు రోజులపాటు జరిగే గ్రామ వాలంటీర్ల దీక్ష సిఐటియు మండల కార్యదర్శి జన్ని. భగత్ రామ్ ప్రారంభించారు. భగత్ రామ్మాట్లాడుతూ,
గ్రామస్థాయిలో అనేక సేవలు చేస్తూ గ్రామ వాలంటీర్లుగా గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ వార్డు వాలంటీర్లను చంద్రబాబునాయుడు గారు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ పదివేల రూపాయలు వేతనాల వెంటనే అమలు చేయాలని వాలంటీర్లను ఉద్యోగ భద్రత కల్పించాలని విధుల కు రాజినామా చేసిన వాలంటీర్లను అవకాశం కల్పించాలని వాలంటరీ వ్యవస్థను చట్టబద్ధత చేయాలని బకాయిలో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్ష నిర్వహించడం జరుగుతుంది.
ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థపై స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు.
వాలంటరీ వ్యవస్థను రాజకీయాల కోణంలో చూడకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి వాలంటరీ వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధి లేకుండా నిరుద్యోగులుగా ఉన్న వాలంటీర్లను గత ప్రభుత్వం రాజకీయంగా వాడుకొని సరైన విధి విధానాలు రూపొందించకుండా కేవలం వారి చేత వెట్టిచాకరి పని చేయించుకున్నారని అన్నారు. చదువుకున్న యువతి యువకులకు నిరుద్యోగులకు ఉపాధి కల్పించవలసిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరైనది కాదు ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించకపోవడంతో వాలంటరీ ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు వి. మధు కార్యదర్శి ఎస్. ఆనందరావు కే. జాను బాబు,ఎస్ .రాజబాబు,బి. బుచ్చన్న,డి. అరుణ, కే జయరాం కె .రాము కె. కృష్ణ జి .వెంకటరావు వి. ధర్మ ,మాణిక్యం కే.మోహన్ తదితరులు పాల్గొన్నారు.రి

## సచివాలయాల్లో షెడ్యూల్ కాస్ట్ వివరాలు...



**కురుపాం: పెన్ పవర్, డిసెంబరు- 26,** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో గల అన్ని సచివాలయాల్లో షెడ్యూల్ కాస్ట్ లిస్ట్ పబ్లిష్ చేయడం జరిగిందని ఎంపీడీవో జె. ఉమామహే శ్వరి తెలిపారు .గురువారం మండలంలో గల బియ్యాలవలస సచివాలయాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ షెడ్యూల్డ్ క్యాస్ట్ కు సంబంధించిన వ్యక్తులు వారి యొక్క వివరాలు సచివాలయంలో ఉన్న లిస్టుల్లో పరిశీలించి తప్పులు తడకలుగా ఉన్న అభ్యంతరాలు సచివాలయాల్లో డిసెంబర్ 26 వ తేదీ నుండి జనవరి 6 వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని జనవరి 10వ తేదీన చివర లిస్టు పబ్లిక్ చేయడం జరుగుతుందని కావున ఇది అందరూ షెడ్యూల్ క్యాస్ట్ ప్రజలు గమనించి సరి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహిసిల్దార్ ఎం.రవణమ్మ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్ల ను డిఎస్పీ తనిఖీ.



డిఎస్పి షేక్ షాబాజ్ ఆహ్మద్.

**కొయ్యూరు,పెన్ పవర్ డిసెంబర్ 26:** కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్లు ను చింతపల్లి డి ఎస్పి షాబాజ్ అహ్మద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఇక్కడ ఉన్న రెండు పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీల్లో భాగంగా అన్నీ రికార్డులను , పోలీస్ స్టేషన్లు పరిస్థితి, సెక్యూర్టీ ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయన పరిశీలించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, కొయ్యూరు ఎస్ ఐ కిషోర్ వర్మ, మంప ఎస్ ఐ శంకరరావు లతో సమావేశమై ఆయా స్టేషన్లు లో ఏడాది పాటు వివిధ కేసుల్లో లభ్యమైన గంజాయి నిల్వలను డిఎస్ పి పరిశీలించారు. గడిచిన ఏడాదిగా రెండు స్టేషన్లు పరిధిలో నమోదు అయిన కేసుల పై వాటి పరిష్కారం, పురోగతి పట్ల ఆయన సమీక్షించారు. అనంతరం స్టేషన్లు భద్రత వైఫల్యాలను సిబ్బంది పనితీరు ను అడిగి తెలుసుకున్నట్టు సి ఐ వెంకటరమణ,ఎస్ ఐ లు కిషోర్ వర్మ , శంకరరావు లు తెలిపారు. స్టేషన్లు తనిఖీ చేసిన డి ఎస్పీ షాబాజ్ అహ్మద్ సంతృప్తి వ్యక్తం చేసినట్టు వారు తెలిపారు. ప్రధానంగా మారుమూల గ్రామాల్లో గిరిజనులకు గంజాయి పంట నిర్మూలన, అక్రమ రవాణా జోలికి వెళ్ళే వాళ్ళను గుర్తించి అవగాహన పరచటం ద్వారా మండల పరిదిలో గంజాయి నివారణ కు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డి ఎస్పీ సి ఐ, ఎస్ ఐ లకు ఈ తనిఖీల్లో ఆదేశించినట్టు సి ఐ వెంకటరమణ, ఎస్ ఐ లు కిషోర్ వర్మ, శంకరరావు లు తెలిపారు.

## విద్యుత్ చార్జీల బాదుడుపై వైసీపీ ర్యాలీ

**అరకులోయ పెన్ పవర్ 26:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి వర్యులు శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కరెంటు చార్జీల బాధుడుపై రేపు అనగా తేది: 27, శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాట కార్యక్రమం నిర్వహించనుంది. అందులో భాగంగా అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గం కేంద్రంగా అరకువేలిలో రేపు ఉదయం: 11:00 గంటలకు గ్రీన్ వేలి హొటల్ జంక్షన్ నుంచి ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఎలక్ట్రికల్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి అధికారులకు ప్రజల సమస్యలను పూర్తి స్థాయి వివరాలతో వినతి పత్రం సమర్పించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కావున అరకు నియోజకవర్గ పరిధిలో గల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయితీ, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలనీ కోరుతున్నాము.

## గిరిజన ద్రోహి వైస్సార్సీపీ జడ్పీటీసీ వారా నూకరాజుకు ప్రజలే బుద్ధి చెబుతారు

**సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు**



**పాడేరు,పెన్ పవర్ డిసెంబర్ 26.** గత ప్రభుత్వంలో, వైస్సార్సీపీ పార్టీ, కొయ్యూరు మండలం జడ్పీటీసీ గా భూదందాలు నడిపిన వారా నూకరాజు షెడ్యూల్డ్ ప్రాంతాలలో కూడా గిరిజనేతరులకు భూమి పట్టాలు ఇవ్వాలని,వారి తరపున వకాల్తా తీసుకొని వాదిస్తున్నాడు.షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఈ వ్యక్తి తప్పుడు ధ్రువపత్రాలతో గిరిజనుడిగా సర్టిఫికెట్ పొంది దాని ఆధారంగా పదవులు, ఆస్తులు సంపాదించాడు.అదే తప్పుడు క్యాస్ట్ సర్టిఫికెట్ను వాడుకొని తన కొడుకుకు టీచర్ పోస్ట్ వచ్చేలాగా చేసుకున్నాడు.కొయ్యూరు, గొలుగొండ మండలాలలో ఆదివాసీల సాగు భూములను స్వాధీనం చేసుకొని వాటిని గిరిజనేతర్లకు అమ్ముకోవడం రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగాడు.గిరిజనేతరులు తెరవెనుక ఉండి పావులు కదుపుతూ ఉండగా,గిరిజన ధ్రువ పత్రం ముందు పెట్టుకుని, ఇతగాడు సాగులో ఉన్న ఆదివాసీలను వెళ్ళగొడుతూ భూమి స్వాధీనం చేసుకొని మరుక్షణం దానిని గిరిజనేతర మదుపుదార్లకు ఆ భూములను ఒప్పగిస్తాడు. అందుకుగాను కమిషన్ పొందుతాడు.
వైస్సార్సీపీ అధికారంలో ఉన్నంతకాలం సాగు అనుభవంలో ఉన్న ఆదివాసీలకు నరకం చూపించాడు.విసుగు చెందిన ఆదివాసీలు,ఆ పార్టీని విడిచిపెట్టి తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడ్డారు.పార్టీ మారినా వార నూకరాజు ఆగడాలు మాత్రం తగ్గలేదు. తెలుగు దేశంలో కొందరిని పట్టుకొని వారిద్వారా రెవిన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తూ,సాగు అనుభవంలో ఉన్న ఆదివాసీలను నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ ఆఫీసు, మండల రెవెన్యూ ఆఫీసు, రోలుగుంట పోలీస్ స్టేషన్ లకు తిప్పుతున్నాడు.
ఇతగాడి బాధలు తట్టుకోలేని చటర్జీపురం ఆదివాసీ సాగుదారులు నర్సీపట్నం సివిల్ కోర్టులో ఇతగాడిపై కేసు దాఖలు చేశారు.అది విచారణలో ఉండగా రోలుగుంట తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావుకి భారీగా లంచాలు ఇచ్చి రికార్డు నుండి ఆదివాసీల పేర్లను తొలగించి, మార్చేసిన రికార్డు ఆధారంగా ఆదివాసీలపై కౌంటర్ కేసు దాఖలు చేశాడు.రెండు కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయి.భూములు అప్పగించేస్తాం-రోలుగుంట తహసిల్దార్ హెచ్చరిక:
ఈనెల 21వ తేదీన రోలుగుంట తహసిల్దార్ చటర్జీపురం ఆదివాసీలను పిలిపించుకుని వార నూకరాజుకు భూమిని అప్పగిస్తామని హెచ్చరించడం విచారకరం.ఆదివాసీలు తాము వేసిన సివిల్ కేసు విచారణలో ఉందని తెలియజేసినా తాసిల్దార్ ఇటువంటి హెచ్చరికలు చేయడం చట్టం విరుద్ధం. ఒకవైపున ఆదివాసీలు సాగు అనుభవంలో ఉన్నారని అంగీకరిస్తూనే మరొకవైపు వారా నూకరాజుకి భూమిని అప్పగిస్తానని ఆదివాసీలను బెదిరించడం సరైనది కాదు.
వైస్సార్సీపీ పాలనలో భూమాఫియా పెట్రేగిపోయిందని తమకు ఓట్లు వేస్తే వారి ఆగడాలను అరికడతామని ఉపన్యాసాలు ఇచ్చిన తెలుగుదేశం నాయకులు తమ పాలనలో కూడా ఇదే పద్ధతులను కొనసాగిస్తే వచ్చే ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాము.
చటర్జీ పురం ఆదివాసీల సాగు అనుభవానికి రక్షణ కల్పించవలసిన బాధ్యత మండల తాసిల్దార్ మరియు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లపై ఉన్నది.ఈ భూమికి గాను సాగులో ఉన్నవారు ఆదిమ తెగలకు చెందిన ఆదివాసీలు. రోలుగుంట తహసిల్దార్ కు భారీ ఎత్తున లంచాలు ఇచ్చి ఆదివాసి సాగుదారుల పేర్లను వారానుక రాజు రికార్డు నుండి తొలగించాడు.వారి పేర్లను తిరిగి పునరుద్ధరించాలని మేము డిమాండ్ చేస్తున్నాము.
అల్లూరి జిల్లా, అనకాపల్లి జిల్లాలలో ఆదివాసీల సాగుభూములకు వారా నూకరాజు ఒక ప్రమాదకరమైన భుదలారీగా మారాడు.అతను తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు
ఇట్లు
బుగత బంగార్రావు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి
రేచుకట్ల సింహాచలం ఆదివాసీ పోరాట సంఘం అధ్యక్షుడు
సవరాల గణేష్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి

## గురుకుల గురువుల సమస్యలు పరిష్కరించాలి:ఆదివాసీ పార్టీ



గురుకుల గురువుల సమస్యలు పరిష్కరించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేసారు.
గత 41 రోజుల నుండి ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు,
అధ్యాపకులు తమను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులనుండి కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని చేస్తున్న రిలే దీక్ష శిబిరానికి సందర్శించి,వారి రిలే దీక్షకు భారత్ ఆదివాసీ పార్టీ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న అంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో ఔట్ సోర్సింగ్ చేస్తున్న ఉపాధ్యాయులు,అధ్యాపకుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి, మెగా డీఎస్సీ లో రిక్రూట్మెంట్ నుండి ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న 1402 పోస్టులను మినహాయించాలని, గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు లెక్చరర్ లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని, జిఓ3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసిన తరువాత ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్సీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు.

## రెవెన్యూ సదస్సు లో సమస్యలన్నీ సత్వర పరిష్కారం.

తహసీల్దార్ ఎస్.ఎల్.వి. ప్రసాద్.



**కొయ్యూరు, పెన్ పవర్ , డిసెంబర్ 26:** గ్రామాల్లో కొన్నేళ్లుగా పరిష్కారంకాని భూ సమస్యలు, పట్టాల పొందటంలో సరిహద్దు సమస్యలకు సత్వరమే పరిష్కారం కల్పించుటకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలోని బంగారంపేట లో గురువారం స్థానిక సర్పంచ్ కురుజు పెంటమ్మ అధ్యక్షతన రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో డి పారం పట్టాలు, అర్ ఓ ఎఫ్ అర్, బంజర్లకు పట్టాఇవ్వాలని పలువురు రైతులు వినతి పత్రాలను అందించారు. సదస్సు లో 80 వినతులు వచ్చినట్టు తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్ కు సర్పంచ్ పెంటమ్మ దుస్సాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రజల నుంచి వచ్చిన వినతులను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న వారందరికీ ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే వారందరికీ పట్టాలు అందిస్తామన్నారు. ఈ సదస్సు లో అర్ ఐ రాజన్నదొర, సర్వేయర్ మూర్తి, స్థానిక వి ఆర్ ఓ జోగులమ్మ, అంతాడ విఆర్ ఓ డి. పద్మ, టీడీపీ నాయకులు లగిజే బాలరాజు, పి. రాజు, కాకూరి చంద్రరావు, ఉల్లి గంగరాజు, వణగిరి శ్రీను, పలువురు రైతులు పాల్గొన్నారు.

## జనవరి 10 వరకు ఎస్సీ కుల గణనపై సోషల్ ఆడిట్

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిసెంబరు 26 :** జిల్లాలో ఎస్సీ కుల గణనపై జనవరి 10వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సి జనాభా, వారి వివరాలు – పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాల పై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారని ఆయన చెప్పారు. గురువారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శన తదుపరి డిసెంబర్ 31వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ జరుగుతోందని ఆయన అన్నారు. జనవరి 10న కుల గణన తుది వివరాలు పొందు పరచడం జరుగుతోందని ఆయన చెప్పారు. డేటాపై అభ్యంతరాలను వీఆర్వో స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారని తెలిపారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను సంబందిత రెవిన్యూ అధికారికి నివేదిస్తారని ఆయన చెప్పారు. వీటిని పునఃపరిశీలించి తహసీల్దారుకు సిఫారసు చేస్తారని, తహసీల్దారు, వీఆర్వో నివేదికలోని వివరాలు పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్లో పొందుపరుస్తారని వివరించారు. పొందుపరిచిన వివరాల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందిం చేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాల్ని తనిఖీ చేయిస్తామని ఆయన అన్నారు. ఈ సోషల్ ఆడిట్ ని పకడ్బందిగా నిర్వహించేందుకు సంబందిత నియోజక వర్గ స్థాయి అధికారులను, జిల్లా అధికారులను నియమించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## 31న డి ఎస్ పి సి ఎ సమావేశం

**కురుపాం / పార్వతీపురం,పెన్ పవర్, డిసెంబరు 26 :** జంతువులపై క్రూరత్వ నియంత్రణ కమిటీ సమావేశం ఈ నెల 31న నిర్వహించడం జరుగుతోందని జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం 31వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని, సంబంధిత అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. గోశాల మంజూరు, నిర్మాణం, అక్రమ పశు రవాణా, కోడి పందేల నివారణ, విద్యా సంస్థలలో జంతు దయ క్లబ్ (%ఖఅఅఝశ్రీ ఎఅఅఎఅవం ఎశ్రీబఎం%) ఏర్పాటు, సామాజిక బాధ్యతతో జంతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలతో సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు.

# దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోల్ కు ధరఖాస్తులు ఆహ్వానం



**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిసెంబరు 26 :** శారీరక దివ్యాంగులు సొంత వ్యాపారం చేస్తున్నా లేదా గుర్తింపు కలిగిన ప్రవేటు సంస్థలలో పనిచేస్తున్నవారికి సొంత మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనం కలిగి ఉంటే పెట్రోల్ సబ్సిడీకి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె కవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల శారీరక దివ్యాంగులు – విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్ణీత ధరఖాస్తు ఫారము పూర్తి చేసి, ధరఖాస్తు ఫారంతో సదరం సర్టిఫికేట్, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, తెల్ల రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనము రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రము (దివ్యాంగుని పేరుతో ఉండాలి), బ్యాంకు పాసు బుక్ మొదటి పేజి, ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ప్రవేటు సంస్థలో పని చేస్తున్న ధృవీకరణ పత్రము, ఒక పాస్ పోర్టు సైజ్ ఫోటో (వికలాంగత్వము కనుపడునట్లు) తదితర ధృవీకరణ పత్రాలతో సమర్పించాలని ఆమె కోరారు. వివరములకు 08942-240519 ఫోన్ నాంబరుకు కార్యాలయ పనివేళలలో సంప్రదించాలని ఆమె కోరారు.

# 31న యువజన ఉత్సవ్



**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, డిశంబర్ 26 :** జిల్లా యువజన ఉత్సవ్ 2024 ను ఈ నెల 31న నిర్వహించనున్నట్టు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె వెంకట ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం జనవరి 12న జాతీయ యువజనోత్సవాలు జరుపుకుంటున్నామని అన్నారు. ఈసారి జిల్లా యువజన ఉత్సవ్ కార్యక్రమం ఈ నెల 31న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నెహ్రు యువ కేంద్రం ఆధ్వర్యంలో జరుపుటకు నిర్ణయించామని పేర్కొన్నారు. జిల్లా యువజన ఉత్సవ్ లో పాల్గొను విద్యార్థినీ, విద్యార్థులు, యువత ఆ రోజు 9.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు జానపద నృత్యాలు, జానపద గీతాలు, రకరకాల పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పోటీలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన విజేతలను రాష్ట్ర స్థాయిలో జరిగే యువజనోత్సవాలకు పంపడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందితే జనవరి 2025న జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఉత్సాహవంతులైన 15 నుండి 29 సంవత్సరాల

వయసు ఉన్న యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారిలో అంతర్లీనంగా ఇమిడియున్న కళా ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని కోరారు. సంస్కృతి సాంప్రదాయాలు కాపాడుకొని, జాతీయ సమైక్యతను పెంపొందించుటకు ఈ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని ఆయన అన్నారు. యువత స్ఫూర్తివంతంగా నైతికతతో భావితరాలకు వారసులుగా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నిలబెట్టుటకు ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్న ఉద్దేశ్యముతో సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. యువ కళాకారుల ప్రతిభను ప్రదర్శించుటకు వేదిక ఏర్పాటు చేయడమైందని, నేటి యువత భావితరాల జాతీయ సంపదగా వెలుగొంది సంస్కృతి, సాంప్రదాయం, ఐక్యతకు బాటలు వేసేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని వివరించారు.

ఈ పోటీలకు అనుభవజ్ఞులైన వారిని న్యాయ నిర్ణేతలుగా ఎంపిక చేశామని అన్నారు. ఈ పోటీలలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. సైన్స్ మేళ, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రూప్ ఈవెంట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.7 వేలు, ద్వితీయ స్థానికి రూ.5 వేలు, తృతీయ స్థానానికి రూ.3 వేలు., వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానికి రూ.1,500, తృతీయ స్థానానికి వెయ్యి రూపాయలు., యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్స్, ఫోటోగ్రఫీ కంటెస్ట్ పోటీల్లో గెలిచిన వారికి ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.2,500, ద్వితీయ స్థానికి రూ.2,500, తృతీయ స్థానానికి రూ.1500 బహుమతిగా అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. యువ ఉత్సవ్ పోటీలలో పాల్గొన్న అభ్యర్థులు అందరికీ సర్టిఫికెట్స్ అందిస్తామని ఆ ప్రకటనలో వివరించారు.

# సర్వే సమస్యలను గ్రామస్తుల సమక్షంలోనే పరిష్కరించండి





● జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

**కురుపాం / పార్వతీపురం, డిసెంబరు 26** :జిల్లావ్యాప్తంగా చేపడుతున్న రెవిన్యూ సదస్సుల్లో గ్రామస్తులు, రైతుల భూములకు సంబంధించి ఎటువంటి సర్వే సమస్యలు లేకుండా సాధ్యమైనంత వరకు వారి సమక్షంలోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తహశీల్దార్లకు, సిబ్బందికి సూచించారు. తద్వారా రైతులకు, గ్రామస్తులకు ఒక భరోసా కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం పార్వతీపురం మండలం పుట్టూరు గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో భూముల సబ్ డివిజన్ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అక్కడే ఏర్పాటుచేసిన లేండ్ మ్యాపుల ఆధారంగా రైతుల భూవివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఏ ఒక్కరూ ఆందోళన చెందనవసరం లేదని భరోసా ఇచ్చారు. భూసమస్యల పరిష్కారం వెనువెంటనే జరిగేలా అధికారులు చొరవ చూపాలని, అర్జీదారుల నుంచి స్వీకరించిన వినతులకు రశీదును అందించాలని అన్నారు. ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సదస్సులో వచ్చిన అర్జీపై తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యకు తగిన పరిష్కారం చూపేవిధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. భూముల జాయింట్ ఎల్.పి.ఎం. సబ్ డివిజన్‌లకు సంబంధించిన సర్వే సమస్యలను గ్రామస్తుల సమక్షంలోనే నిర్వహించాలని సూచించారు. పరిష్కారమైన సబ్ డివిజన్‌ల వివరాలను తప్పక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, తహశీల్దారు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల గురువుల సమస్యలు పరిష్కరించాలి:ఆదివాసీ పార్టీ

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,డిసెంబర్ 26:**గురుకుల గురువుల సమస్యలు పరిష్కరించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేసారు.

గత 41 రోజుల నుండి ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులనుండి కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని చేస్తున్న రిలే దీక్ష శిబిరానికి సందర్శించి,వారి రిలే దీక్షకు భారత్ ఆదివాసీ పార్టీ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న అంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో ఔట్ సోర్సింగ్ చేస్తున్న ఉపాధ్యాయులు,అధ్యాపకుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి,మెగా డీఎస్సీ లో రిక్రూట్మెంట్ నుండి ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న 1402 పోస్టులను



మినహాయించాలని, గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు లెక్చరర్ లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని, జిఓ3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసిన తరువాత ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్సీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికై గ్రామసభలు...





**తహసిల్దార్ ఏ.వేణుగోపాల్**

**నాతవరం పెన్ పవర్ ( డిసెంబర్ 26):** రెవెన్యూ సమస్యల పరిష్కారాని కై ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తాసిల్దార్ ఏ.వేణుగోపాల్ అన్నారు.గురువారం మండలం లో గల వెదురుపల్లి లో గ్రామంలో గల సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో సర్వే పూర్తయిన గ్రామాల్లో వివిధ భూ సమస్యలపై రైతులతో గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా భూ సర్వే రికార్డుల ఏడి ఎస్.గోపాల్ రాజా,మాజీ సర్పంచులు కాళ్ళ సత్యనారాయణ,పారుపల్లి వెంకటరమణ,టిడిపి యువ నాయకులు పారుపల్లి చినబాబు,గొలుగొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ,టిడిపి యువ నాయకులు బొడ్డు శివ, గుమ్మడికొండ సూపర్ ఎంపీటీసీ సుర్ల అచ్చియ్య నాయుడు,మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య రికార్డ్స్ పక్కాగా నిర్వహించాలి...

**కురుపాం / సీతానగరం, పెన్ పవర్, డిసెంబర్26:** వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య వివరాల రికార్డులు పక్కాగా నిర్వహించాలని,ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది పర్యవేక్షణ చేయాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. జోగింపేటలో కెజిబివి, ఎస్ఓఈ వసతి గృహాలను గురువారం సందర్శించారు. విద్యార్థుల హీమోగ్లోబిన్ రక్త పరీక్షల నివేదికలను తరగతుల వారీగా రికార్డులో పరిశీలించి తక్కువగా నమోదు అయిన విద్యార్థుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని లతో మాట్లాడి ప్రతీ రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిస్తున్నారా ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొని సిబ్బందికి తగు సూచనలు చేశారు.విధిగా ఐరన్ మాత్రలు విద్యార్థులకు వేయించాలని,పోషకాహారం సరిగా తీసుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు.సిక్ రిజిస్టర్ పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల వివరాలు స్పష్టంగా ఉండాలని,ఆరోగ్య సమస్య,ప్రారంభ మరియు నయమైన తేదీలు,చికిత్స ఇచ్చిన ప్రదేశం,చికిత్సా వివరాలు ఉండాలన్నారు. సిక్ రూమ్ లో ఆరోగ్య సమస్యతో ఉన్న విద్యార్థితో ఆయన మాట్లాడి అందజేస్తున్న చికిత్సా వివరాలపై




సిబ్బందిని ఆరా తీసారు.అక్కడ మందులు తనిఖీ చేసారు. వసతి గృహ హెల్త్ సిబ్బంది మందుల వినియోగం, కాలపరిమితి వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న హెల్త్ స్క్రీనింగ్ ఏ మేరకు పూర్తి అయ్యిందని, ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన విద్యార్థుల ఆరోగ్యం మెరుగు పడేవరకు,అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య,హాస్టల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మరాజు,ఉమాదేవి, సూపర్వైజర్స్ సత్యవతి,శర్మ, వైద్య సిబ్బంది చైతన్య,మీనా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మారిన జగన్ సేవలో పంచాయతీ సెక్రటరీ ఎం.సోమరాజు .....

వెదురుపల్లి పంచాయితీ కార్యాలయంలో జగన్ ఫోటో దర్శినం....

ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ఫోటోలు ఎక్కడ.?




**నాతవరం పెన్ పవర్ (డిసెంబర్ 26):** మండలంలో గల వెదురుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జగన్ ఫోటో ఇప్పటికీ పంచాయితీ కార్యదర్శి సోమరాజు తొలగించకపోవడం చూస్తుంటే ఇంకా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉందనే భ్రమలో పనిచేస్తున్నట్టుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు అవుతున్న ఇప్పటికీ కూడా జగన్ ఫోటో తొలగించకపోవడం,అలాగని ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలు పెట్టక పోవడం పై పలువురు పెదవులు విరుస్తున్నారు. ఇప్పటికైనా పై అధికారులు గమనించి,ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ఫోటోలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఘనంగా సీపీఐ 100వ ఆవిర్భావదినోత్సవ వేడుకలు

జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి సత్యనారాయణ .



**కొయ్యూరు,పెన్ పవర్ డిసెంబర్ 26:**దున్నేవాడిదే భూమి నినాదంతో ప్రజా పోరాటాలతో వందేళ్ళ చరిత్రలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల కోసం పోరాడి అనేక విజయాలను సాధించి నేటికీ వందవ ఏడాదిలో అడుగుపెడుతున్న నేపథ్యంలో పార్టీ త్యాగాలు మరువలేనివి అల్లూరి జిల్లా సీపీఐ పార్టీ ప్రధాన కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. మండలంలోని అంతాడ పంచాయితీ మునసలలో గురువారం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ– సీపీఐ పార్టీ గిరిజన, బడుగు బలహీనర్గాలకు హక్కులకోసం ఎందరో నాయకుల ప్రాణాల త్యాగపలమే నేడు పార్టీ ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో చెక్కు చెదరలేదన్నారు. అనేక పోరాటాలతో దున్నే వాడిదే భూమి నినాదంతో స్వర్గీయ మేకా సూరిబాబు నాయకత్వాన ఏభై వేల ఎకరాల భూములను గిరిజనులకు పంచిన ఘనత సీపీఐ పార్టీదే అన్నారు. ఈ వందేళ్ళ చరిత్ర పై గ్రామ గ్రామాన ఉద్యమ స్ఫూర్తి తో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ పార్టీ నాయకులు దేముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లి సత్యనారాయణ, మహిళా నాయకురాలు వంతాల లక్ష్మీ , వియ్యపు నానాజీ, సత్యవేణి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారిపోతున్న రహదారులు



**విజయవాడ, డిసెంబర్ 26, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో రహదారులు అన్నీ అద్వాన్నంగా ఉన్నాయి. గత ప్రభుత్వం రహదారులను పట్టించుకోలేదు. దీంతో రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. ఎక్కడ చూసినా గుంతలే. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక సంక్రాంతి పండగ నాడు అక్కడకు వెళ్లిన వారంతా ముక్కున వేలేసుకున్నారు. ఏపీ రహదారులపై ప్రయాణించడం కష్టమేనని మ్యూజిక్ డైరెక్టర్ తమన్ నుంచి అనేక మంది ప్రముఖులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అప్పటి మంత్రి కేటీఆర్ కూడా ఏపీ రహదారులపై సెటైర్లు వేశారు. తనకు ఆంధ్రకు వెళ్లివచ్చిన మిత్రుడొకరు చెప్పారని, ఏపీ రహదారులపై ప్రయాణించడం నరకమేనని అన్నారన్నారు. తెలంగాణలో రహదారులను చూసి గర్వంగా ఉందని కూడా కేటీఆర్ అన్నారు.. అప్పట్లో ఏపీలో రహదారుల పరిస్థితిపై సోషల్ మీడియాలో పెద్దయెత్తున చర్చ జరిగింది. జనసేన అయితే ఏకంగా రహదారులపై గుంతలను పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. ఎవరేమనుకున్నా, రహదారులు బాగాలేకపోయినా సరే వాటికి నిధులు కేటాయించలేదు. అయితే గత ప్రభుత్వం అంటే 2014 లో ఏర్పాటయిన నాటి చంద్రబాబు సర్కార్ రహదారులను నిర్మించినా, అవి మూణ్ణాళ్లకే మరమ్మతులకు గురయ్యాయని కూడా వైసీపీ సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. గత ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలు కావడానికి అద్వాన్నమైన రహదారులు కూడా ఒక కారణంగా చెప్పాల్సి ఉంటుంది. గుంతలతో కూడిన రహదారులపై ప్రయాణం భయానకంగా మారడంతో వాహనాలు కూడా మరమ్మతులకు తరచూ గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో రహదారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇందుకోసం మరమ్మతులకు దాదాపు 850 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం విడుదలచేసింది. ప్రాధాన్యతా క్రమంలో రహదారుల మరమ్మతులను చేయాలని నిర్ణయించింది. దీంతో పాటు సంక్రాంతి నాటికి రోడ్లు అద్దాల్లా మెరవాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అలాగే ఎమ్మెల్యేలకు కూడా తమ నియోజకవర్గం పరిధిలో అద్వాన్నంగా రహదారులను బాగుచేయించుకునే బాధ్యతలను అప్పగించారు. సంక్రాంతికి ఏపీకి వచ్చేవారు ఎవరూ ఏపీ రహదారుల గురించి విమర్శించ కూడదని చంద్రబాబు ఎమ్మెల్యేలకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. దీంతో పనులు వేగంగా జరుగుతున్నాయి... ఇప్పటికే అనేక రహదారులు మెరుగు పడ్డాయి. ముఖ్యమైన రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి. అదే సమయంలో గిరిజన ప్రాంతాల్లో పల్లె పండగ కార్యక్రమం కింద రహదారుల నిర్మాణం చేపట్టడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించారు. తర్వాత క్రమంగా కొన్ని ముఖ్యమైన రహదారులను పబ్లిక్, ప్రయివేట్, పార్ట్ నర్ షిప్ కింద ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. అయితే ఈ రహదారులపై ప్రయాణించే తప్పనిసరిగా టోల్ ఫీజు చెల్లించాల్సి రావడంతో ఇంకా ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. అయితే నిధుల లేమి కారణంగా ఏపీలో రహదారులను పీపీపీ పద్ధతిలోనే అభివృద్ధి చేయాలన్న నిశ్చయంతో చంద్రబాబు ఉన్నారు. మొత్తం మీద సంక్రాంతికి వెళ్లేవారికి రహదారులు హ్యాపీ వెల్ కమ్ చెప్పడం గ్యారంటీ.

అయ్యా, రోడ్లు వేయండి.. గతుకుల రోడ్డుపై 'డ్రోన్' సందేశం

గ్రామాలలో రోడ్లు అధ్వాన్నంగా ఉంటే, నిరసనలు తెలియజేయడం పరిపాటి. సాధారణంగా రహదారిలో నిల్వ నీటిలో నాట్లు నాటడం, నీటిలో నిలబడడం ఒంటి కార్యక్రమాలతో నిరసనలు తెలియజేస్తుంటారు. కానీ ఇక్కడ వినూత్న రీతిలో రహదారి గుంతల మయంగా ఉందంటూ నిరసన తెలిపారు. అది కూడా ఎలాగో కాదు.. ఏకంగా డ్రోన్ కెమెరాతోనే నిరసన తెలిపారు. ఈ ఘటన విజయనగరం జిల్లాలో చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా వంగర మండలం కొండవలస గ్రామం నుండి భాగెమ్మపేట వరకు సుమారు 10 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లే రహదారి నిరంతరం గుంతలమయం కావడం విశేషం. 2010 నుండి ఇప్పటివరకు కూడా రహదారి గుంతల మాయం కావడంతో వాహనాదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రాత్రివేళ ఈ రహదారిలో ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులు తప్పవు. ఈ రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు పలుమార్లు ప్రమాదాల బారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయట. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధ్వాన్నంగా ఉన్న రహదారులను మరమ్మత్తులు చేస్తున్న నేపథ్యంలో, తమ గ్రామ రహదారి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అక్కడ యువకులు భావించారు. అయితే వినూత్నంగా నిరసన తెలిపితే ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరిస్తుందన్న ధోరణితో యువకులు వినూత్నంగా తమ నిరసన తెలిపి, రహదారిని అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. డ్రోన్ కెమెరాను ఉపయోగించి, నూతన రహదారి నిర్మించాలని కోరుతూ ఆ రహదారిలో ప్లకార్డును వారు ప్రదర్శించారు. గుంతల రోడ్డుతో తాము ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే ప్రభుత్వం స్పందించి తమ గ్రామాలకు రహదారి నిర్మించాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం మీద డ్రోన్ కెమెరాతో నిరసన తెలిపిన యువకుల వినూత్న నిరసనకు ప్రభుత్వం నుండి ఏ మేరకు స్పందన వస్తుందో వేచి చూడాలి

# పందెం కోళ్లకు డిమాండ్ షురూ...



**ఏలూరు, డిసెంబర్ 26, పెన్ పవర్:** సంక్రాంతి అంటేనే కోడిపందేలు? కోడి పందేలు అంటే సంక్రాంతి.. అలా వుంటుంది క్రేజ్.. ఏపీలో.. మరీ ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో సంక్రాంతి హడావిడిగురించి ఎంత చెప్పినా తక్కువే.. పండగ మూడు రోజులు కోడిపందేల జోష్ ఇక్కడి ప్రజలను ఊపేస్తుంది..కోడిపందేల పేరుతో కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. గోదావరి జిల్లాలకే ప్రత్యేకత తెచ్చిన కోడి పందేలకు కోళ్లు సిద్ధమయ్యాయి. దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేవారు ఇప్పటికే రైలు, బస్సు, ఫ్లైట్ టికెట్లు బుక్ చేసేసుకున్నారు. ఇక పందెం రాయుళ్లు హడావిడి కూడా పండుగ ముందు నుంచే మొదలైంది మరో రెండువారాలు దాటితే?.కోడిపుంజులను కొనేందుకు ఎగబడతారు పందెం రాయుళు.. కండబట్టి పందేనికి సిద్ధంగా ఉన్న ఒక్కో కోడి పుంజు ధర 50 వేల నుంచి 2 లక్షల రూపాయల వరకు పలుకుతోంది. నాటు కోడి పుంజు మాంసం కిలోవెయ్యి నుంచి పదిహేను వందల రూపాలయవరకు ఉంటుంది. అదే పందెం కోడి పోషణ కోసమే 25వేల రూపాయలు వరకు ఖర్చుచేస్తారు. గోదావరి జిల్లాలో పందెం కోళ్ల పెంపకం ఒక కుటీర పరిశ్రమలా సాగుతుంది. పామాయిల్ తోటల్లో షెడ్లు నిర్మించి పందెం కోళ్లను పెంచుతారు. ఒక్కో తోటలో నాలుగు వందల పుంజుల వరకు ఉంటాయి. పందేల్లో గెలిచిన పుంజులను ప్రత్యేకంగా చూస్తారు. వాటిని కోడి పెట్టలతో కలిసేలా చేస్తారు. కోడి గుడ్లు పెట్టడంనుంచి వాటిని పొదిగి పిల్లలయ్యేలా చేస్తారు. పిల్ల దశ నుంచే ఒక్కో పుంజుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఆరు నెలలు మొదలు ఏడాది వరకు వాటిని గుంపులోనే ఉంచుతారు. వాటిలో పోరాడే నైజం వచ్చే వరకు స్వేచ్ఛ గా వదిలేస్తారు. తర్వాత వాటిని గాబుల్లోకి మారుస్తారు. ఇలా వీటిని మరో 5 నెలల పాటు ఉంచి బలవర్ధకమైన ఆహారం, పోషణ అందించి వాటితో వ్యాయామం చేయించి కండను పెంచుతారు. తిండి కలిగితే కండ కలదు.. కండ ఉన్నదే పందేనికి సిద్ధం?. ఈ పందెం కోళ్ల కండలను పెంచడానిక వాటికి పెట్టే మేతను చూస్తే నోళ్లు వెళ్లబెట్టాల్సిందే.. బాదంపప్పు, పిస్తా, అంజీర్, తేనె, మటన్ కైమా, విటమిన్ టాబ్లెట్స్, ఇంజెక్షన్లు ఇలా ఈ మెనూ చాంతాడంత ఉంటుంది. కోడి పుంజులు అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు పరీక్షించి నాణ్యమైన మెడిసిన్స్ అందిస్తారు. పందేల్లో పాల్గొనే కోడి పుంజుల ఈకల రంగును బట్టి దాని జాతిని నిర్ణయిస్తారు. కాకి, సేతు, పర్ల, కొక్కిరాయి. డేగ, నెమలి, కౌజు, పూల, నల్లబోర ఇలా కోడిపుంజుల్లో చాలా రకాలున్నాయికోడిపుంజుల పెంపకంలో మొదటి ప్రక్రియ నీటిలో ఈత కొట్టించడం ఒకటైతే.. తర్వాత సాక చాలా కీలకమైంది? సాక అంటే కొన్ని ఆయుర్వేద వనమూలకలతో తయారైన ఆయిల్, ఆకులను వేడి నీటిలో మరిగించి ఆ నీటితో కోడికి మసాజ్ చేస్తారు .. దీనివల్ల కోడిపుంజు చాలా రిలాక్స్‌డ్‌గా ఫీల్ కావడమేకాక బలిష్ఠంగా తయారవుతుందంటున్నారు నిర్వాహకులు. పండగకు నాలుగు నెలల ముందునుంచే పందెం కోళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెడతారు వీటి పెంపకం దారులు.. పండగ నాటికి కోడిని అన్నిరకాలుగా తీర్చిదిద్దుతారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో సంక్రాంతికి 200 నుంచి 500 వరకు పందెం బరులు సిద్ధమవుతాయి.. ఉమ్మడి గోదావరి జిల్లాలో రాజమండ్రి కాకినాడ రాజానగరం, కాట్రేనుకోన అమలాపురం రాజోలు, రావులపాలెం కొత్తపేట , అంబాజీపేట, మలికిపురం, పలు ప్రాంతాల్లో కోడిపందాల బెట్టింగ్ లక్షల్లో కొనసాగుతుంది.. ఈ పందేలను తిలకించేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు సైతం హాజరవుతుంటారు? వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా పందెం రాయుళ్లు చేస్తారు.. బరిని బట్టి రూ. 1 లక్ష నుంచి 25 లక్షల వరకు ఒక్కో కోడి పందెం జరుగుతుంది. ఏ పుంజుపై పందెం కాయాలన్న విషయం నిర్ణయించుకోవడానికి కోడి కండను చూడటమేకాక, కోడి జ్యోతిష్యంపై కూడా ఆధారపడుతున్నారు పందెం రాయుళ్లు. మనుషులకు ఒక శాస్త్రం ఉన్నట్లే కోళ్లకు కూడా కుక్కుట శాస్త్రం అందుబాటులో ఉంది. చాలామంది పందెం రాయుళ్లు కుక్కుట శాస్త్రాన్ని అనుసరించే పందేలు కాస్తారు. ఏ జాములో ఏ రంగు పుంజుపై పందెం వేస్తే గెలుస్తుందో కుక్కుట శాస్త్రంలో ఉందనీ చెప్తున్నారు పెంపకం దారులు. తమ జాతక బలానికి, కోడి జాతక బలం తోడైతే ఇక విజయం తమదేనని నమ్ముతున్నారు పందెం రాయుళ్లు. పందేల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తుందో లేదో చూడాలి మరి.

# ప్రైవేటీకరణ దిశగా విశాఖ స్టీల్ ప్లాంట్

**విశాఖపట్టణం, డిసెంబర్ 26, పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-ఆర్ఐఎన్ఎల్)ను ప్రైవేటీకరణ చేసేందుకు మొగ్గు చూపుతోంది. ఇప్పటికే కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో చర్యలకు పూనుకుంటుంది. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌లోని ఒక్కో భాగం ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి కేంద్ర ప్రకటన వెలువడిన తరువాత ఒక్కొక్క చర్యలు చేపట్టింది. ఇప్పటికే దాదాపు 2,000 మంది ఉద్యోగులను ఛత్తీస్‌గడ్‌లోని నాగర్‌నర్ స్టీల్‌ప్లాంట్‌కు పంపడానికి సిద్ధపడింది. అలాగే 4,200 మంది స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తొలగించేందుకు వారికి ఎంట్రీ, ఎగ్జిట్ పాస్‌లను ఇవ్వకుండా కుట్రలు చేసింది. కార్మికులు పోరాటంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. అలాగే బ్లాస్ ఫర్నేస్‌ను నిలిపివేసింది. ఆక్సిజన్ ప్లాంట్‌ను నిలిపివేసింది. మళ్లీ కార్మికుల ఆందోళనతో వెనక్కి తగ్గింది. ఇలాంటి కుట్రలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిపై ప్రభావం చూపే విధంగా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం చర్యలకు పూనుకున్నాయి. తాజాగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఒక యూనిట్‌ను ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేసింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఫైర్ స్టేషన్ నడిపే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబందించి వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానించింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఆర్ఎంహెచ్‌పీ, సింటర్ ప్లాంట్, కోక్ ఓవెన్స్, స్టీల్‌మెల్ట్ షాప్, బ్లాస్ట్‌ఫర్నేస్, రోలింగ్ మిల్స్, ఎయిర్ సెపరేషన్ ప్లాంట్, సీఆర్ఎంపీ, థర్మల్ పవర్ ప్లాంట్, ఎల్‌పీజీ స్టోరేజ్ ట్యాంక్‌లు, వాటర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, గ్యాస్ హోల్డర్లు, ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, స్టీల్‌ప్లాంట్‌లోని ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ తదితర కీలకమైన విభాగాల్లో ఫైర్ స్టేషన్ సేవలు అందిస్తుంది. అదే విధంగా అడ్మినిస్ట్రేషన్ భవనం, హాస్పిటాలిటీ సర్వీసెస్, హిల్‌టాప్ గెస్ట్‌హౌస్, ఎల్ అండ్ డీసీ, టౌన్‌షిప్, పాఠశాలలు, బ్యాంకులు, పోస్టాఫీస్, పబ్లిక్ బిల్డింగ్‌లలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పుడు ఆయా కీలక విభాగాల్లో అగ్నిమాపక సేవలు అందించడానికి, ఆయా ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ఫైర్ స్టేషన్‌ను వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని సీఐఎస్ఎఫ్ నిర్వహిస్తోంది. 40 ఏళ్లగా సేవలందిస్తున్న సీఐఎస్ఎఫ్‌ను తొలగించి, ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేయడం దుర్మార్గమైన చర్య అని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ విమర్శించారు. యాజమన్యం విడుదల చేసిన నోటిఫికేషన్ దారుణమైనదని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటి ప్రైవేట్ పరం అవుతుంటే కనీసం స్పందించటం లేదు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కానీ ఆయన కూడా మౌనం దాల్చడంపై స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీ భరత్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పందించటం లేదు. అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు కోరిన కె. రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి అయిన తరువాత, స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం పట్టించుకోవడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు.

## మహిళలకు కో-వర్కింగ్ స్పేస్ సెంటర్లు

**విజయవాడ, డిసెంబర్ 26, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కో-వర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్ అభివృద్ధిపై దృష్టి సారించింది కూటమి ప్రభుత్వం. కో-వర్కింగ్ స్పేస్, వర్క్ ఫ్రం హోమ్‌తో మానవ వనరుల సమర్థ వినియోగం వైపుగా అడుగులు వేస్తుంది. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉన్న వారికి ట్రైనింగ్ ఇచ్చి అవకాశాలు కల్పిస్తూ అలాంటి వారి కోసం వర్కింగ్ స్పేస్ క్రియేట్ చేయనున్నారు. గృహిణులకు గుడ్ న్యూస్.. వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో ఇకపై మహిళలకు ఉపాధి మార్గాలుఏపీలో చదువుకున్న మహిళలు గృహిణిలుగా మిగిలిపోకూడదనీ, వారికి అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది కూటమి ప్రభుత్వం. వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు విస్తృతంగా అవకాశాలు ఇవ్వనున్నారు. మహిళలను ఇంటికి, ఇంటి పనికి పరిమితం చేయడం సరికాదని.. ఇప్పటికీ చదువుకున్న మహిళలు ఇళ్లల్లో ఉంటున్నారని? వారికి వర్క్ ఫ్రం హోమ్ అందుబాటులోకి తెస్తే ఆన్లైన్ విధానంలో పనిచేసి ఉపాధి పొందుతారని భావిస్తుంది. మహిళల్లో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉన్న, కుటుంబ వ్యవహారాలు, బాధ్యత కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితం అయిపోతారు. ఇలాంటి వారికి అవకాశాలు కల్పిస్తే.. ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని భావిస్తుంది ఏపీ ప్రభుత్వం. కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ల ఏర్పాటులో 2025 డిసెంబర్ చివరినాటికి 1.50 లక్షల సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని టార్గెట్ పెట్టుకుంది. ఒక్కో సీటుకు 50-60 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరమని.. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లు ఏర్పాటు చెయ్యనున్నారు. ఇప్పటివరకు ప్రైవేటు, ప్రభుత్వ భవనాల్లో 22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎంతమంది వర్క్ ఫ్రం హోమ్‌లో పనిచేస్తున్నారు.. వారి అవసరాలు ఏంటనే సమాచారం సేకరించనున్నారు. అదే విధంగా ఇప్పటికే నిర్ణయించినట్లు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో 5 చోట్ల భవనాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. ఆ ప్రాంతంలోని పరిశ్రమలను, విద్యా సంస్థలను ఇన్నోవేషన్ హబ్‌లకు అనుసంధానం చెయ్యనున్నారు.

# వారసుడి కోసం బొత్స ప్రయత్నాలు...



**విజయనగరం, డిసెంబర్ 26, పెన్ పవర్:** బొత్స సత్యనారాయణ .. ప్రస్తుత రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు. 1999 నుండి 2024.. అంటే రెండున్నర దశాబ్దాల నుండి ఉమ్మడి విజయనగరం జిల్లా రాజకీయాలను ప్రభావితం చేస్తున్న నేత . రాజకీయంగా కాంగ్రెస్‌లో పుట్టి ప్రస్తుతం వైసీపీలో కూడా చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో జగన్‌కు దక్కని హోదాను దక్కించుకున్నారంటే బొత్స రాజకీయ చాతుర్యం అర్థం అవుతుంది. 1999లో బొబ్బిలి ఎంపీగా కాంగ్రెస్‌లో తన ప్రస్థానం మొదలుపట్టిన బొత్స విజయనగరం జిల్లాలో కాంగ్రెస్ పెద్ద దిక్కుగా మారడమే కాదు.. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయికి ఎదిగారు. అంతే కాదు భార్య బొత్స ఝాన్సీ నుండి తమ్ముళ్ళు , మేనల్లుడు అందరినీ రాజకీయాల్లోకి తీసుకువచ్చి నచ్చిన పదవులను కట్టబెట్టేలా అటు రాజశేఖర్ రెడ్డి దగ్గర నుంచి జగన్ వరకు తనదైన స్టైల్లో ఒప్పించారు . లిక్కర్ కింగ్ , వోక్స్ వేగన్ , భూ మాఫియా , ఉద్యోగాల అమ్మకం అంటూ ఎన్ని అవినీతి ఆరోపణలొచ్చినా వాటితో తనకేం సంబంధం లేదన్నట్లు తనదైన స్టైల్లో రాజకీయం చేస్తుంటారాయన . ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఒకానొక దశలో టీడీపీ నేత అశోక్ గజపతిరాజును మించి రాజకీయం చేశారనడంలో ఎలాంటి సందేహం లేధు . కాపు నాయకుడిగా కాంగ్రెస్ హయాంలో తనదైన మార్క్ వేసుకున్నారు. వైసీపీలో జాయిన్ అయిన తరువాత మాత్రం సత్తిబాబు ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వచ్చింది . వైఎస్ దగ్గర ఉన్న పవర్ జగన్ వద్ద సంపాదించలేక పోయారంటారు రాజకీయ విశ్లేషకులు . సత్తిబాబు లాంటి సీనియర్‌ను పక్కనబెట్టి విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి లాంటి వాళ్ళకి ఉత్తరాంధ్ర పార్టీ బాధ్యతలను అప్పజెప్పడం 2024 లో వైసీపీకి పెద్ద మైనస్‌గా మారిందంటారు . ఆఖరికి సత్తిబాబు సతీమణి ఝాన్సీని విశాఖ ఎంపీ స్థానంలో బలవంతంగా బరిలోకి దింపిన వైసీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆ తరువాత విశాఖ నుండి బొత్సను ఎమ్మెల్సీ చేయడం, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఎన్నుకోవడం లాంటివి చకచకా జరిగిపోయాయి. అయితే ఇపుడు ఇదే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నారట సత్తిబాబు . అసలే రాజకీయాల్లో అవకాశాల్ని అందిపుచ్చుకోవడంలో ఘనపాటిగా పేరున్న సత్తిబాబు ఫుల్ ఫ్యామిలీ ప్యాక్ తో రెండు జిల్లాలో బరిలోకి దిగాలని చూస్తున్నారట . దానికి తగ్గ గ్రౌండ్ వర్క్ అపుడే స్టార్ట్ చేశారనే వార్తలు కూడా గుప్పుమంటున్నాయి. నిజానికి గత ఎన్నికల్లో ఆయన పక్కకి తప్పుకొని తనయుడు సందీప్‌ని చీపురుపల్లి నుండి బరిలోకి దించాలని యత్నించారు . వాని జగన్ ససేమిరా అనడంతో మరోసారి బొత్స బరిలో దిగారు . విశాఖ ఎంపీగా ఆయన భార్య ఝాన్సీ , విజయనగరం జిల్లాలో సోదరులు బద్దుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్యలతో పాటు తాను కూడా ఘోర పరాజయం చవిచూశారు . అయితే ఈసారి ఎలా అయినా కొడుకు సందీప్‌తో రంగ ప్రవేశం చేయించి తాను విశాఖ నుండి రాజకీయాలు చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారట. ఆ రెండు జిల్లాలు తన కనుసన్నల్లో ఉండేట్లుగా ప్లాన్ చేస్తున్నారట . అందుకే సొంత జిల్లా విజయనగరానికి చుట్టం చూపుకి వచ్చిపోతూ ఫోకస్ అంతా వైజాగ్‌పై పెడుతున్నారంట. కిమిడి ఫ్యామిలీకి పోటీగా ఇప్పటినుండే చీపురుపల్లి నియోజకవర్గ బాధ్యతలు పూర్తిగా కొడుకు సందీప్‌కి అప్పగించే యోచనలో ఉన్నారట . గతంలో మేనల్లుడు చిన్న శ్రీను ఈ నియోజకవర్గానికి బొత్సకి బదులుగా గార్డియన్‌గా ఉండేవారు . విజయనగరం జడ్పీ చైర్మన్ అయిన చిన్నశ్రీను ఇప్పుడు సొంత లెక్కలతో బొత్సకు దూరం జరిగారు. ఆ క్రమంలో చీపురుపల్లి బాధ్యతలు సందీప్ కి అప్పగించేసి ఇప్పటి నుండే 2029 ఎన్నికలకు సిద్ధమయ్యేలా ప్రిపేర్ చేస్తున్నారట . సందీప్‌కి చెందిన ధీరా ఫౌండేషన్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమలు చేస్తున్నప్పటికీ , ఆయన మాత్రం ప్రస్తుతానికి సమయం కేటాయించడం లేదు. ఇక నుండి అలా కాకుండా నియోజకవర్గంపై ఫోకస్ చేయాలని తనయుడుకి సూచిస్తున్నారట బొత్స. ముఖ్యంగా విశాఖ ఆర్థిక రాజధానిగా దినదినాభివృద్ధి చెందడం, తన వ్యాపారాలన్నీ ఎక్కువగా ఇక్కడే ఉండడం , అక్కడ వైసీపీకి సరైన నాయకుడు కూడా లేకపోవడాన్ని అదనుగా చేసుకుంటున్న బొత్స విశాఖలో జెండా పాతడానికి గ్రౌండ్‌వర్క్ చేసుకుంటున్నారంట . గత ఎన్నికల్లో వైవీ సుబ్బారెడ్డి , విజయసాయిరెడ్డిల పెత్తనంతో ఉత్తరాంధ్రలో వైసీపీ చతికిల పడింది. అది కూడా బొత్సకి కలిసివచ్చే మరో అంశంగా కనిపిస్తుంది . ఇదే అదనుగా విశాఖలో పాతుకుపోవడానికి బొత్సకి సరైన అవకాశం దొరికిందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి . చూడాలి మరి బొత్స ప్లాన్ ఏ మేరకు వర్క్ అవుట్ అవుతుందో?

# కోహ్లీ కావాలనే గొడవకు దిగాడు.. ముమ్మాటికీ అతనిదే తప్పు: రికీ పాంటింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** బాక్సింగ్ డే టెస్టు తొలిరోజు ఆటలో భారత స్టార్ విరాట్ కోహ్లీ, ఆసీస్ యువ ఆటగాడు సామ్ కొంటాస్ మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. పిచ్ పక్కన నడిచే సమయంలో భారత స్టార్ ఆసీస్ యువ ఆటగాడి భుజాన్ని భౌతికంగా తాకుతూ నడిచి వెళ్లడం ఈ వాగ్వాదానికి దారితీసింది. ఈ ఘటనపై ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ స్పందించారు.

కోహ్లీ కావాలనే కొంటాస్‌తో గొడవకు దిగినట్లు పాంటింగ్ వెల్లడించారు. ఈ ఘటన పొరపాటున జరిగినదని కాదని.. విరాట్ నడుస్తున్న తీరు చూస్తే అర్థమైపోతుందని పాంటింగ్ అన్నారు. కొంటాస్ తన దారిన తాను వెళ్తుంటే.. విరాట్ కావాలనే తన డైరక్షన్ మార్చుకున్నాడని ఆసీస్ మాజీ వ్యాఖ్యానించారు.

**ఏం జరిగిందంటే..?**

ఈ మ్యాచ్‌లో 19 ఏళ్ల యువకుడు సామ్ కొంటాస్ ఆస్ట్రేలియా తరపున టెస్ట్ అరంగేట్రం చేశాడు. అతని పట్ల కోహ్లీ అత్యుత్సాహం చూపాడు. ధాటిగా ఆడుతున్నాడన్న కోపంతో.. అతన్ని భుజంతో ఢీకొట్టడమే కాకుండా మాటల యుద్ధానికి దిగాడు. ఈ ఘటన బుమ్రా వేసిన 11వ ఓవర్‌లో చోటుచేసుకుంది. వెంటనే మరో ఓపెనర్ ఉస్మాన్ ఖావాజా, అంపైర్ జోక్యం చేసుకొని ఇద్దరికీ సర్ది చెప్పారు. కోహ్లీ రెచ్చగొట్టాక.. కొంటాస్ మరింత చెలరేగిపోయాడు. తొలి టెస్టులోనే హాఫ్ సెంచరీ చేసి ఔరా అనిపించాడు. 65 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌ల సాయంతో 60 పరుగులు చేశాడు.

**నిషేతం తప్పదా..!**

కోహ్లీ చర్యలు అతని ఏకాగ్రతను దెబ్బ తీసేలా ఉన్నప్పటికీ.. ఐసీసీ ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉండడంతో భారత స్టార్ పై నిషేధం పడే అవకాశమున్నట్లు కథనాలు వస్తున్నాయి. %×జజ% ప్రవర్తనా నియమావళి 2.12 ప్రకారం, ఇలాంటి ఘటనల్లో ఆటగాడిపై ఒక అంతర్జాతీయ మ్యాచ్ నిషేధం పడనున్నట్లు చెప్తున్నాయి. అదే లెవల్ 1 కింద నేరాన్ని పరిగణనలోకి తీసుకుంటే, కోహ్లీ కేవలం జరిమానాతో తప్పించుకోవచ్చు. ఈ విషయంపై ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# గొడవలో కోహ్లీదే తప్పని తేల్చిన మ్యాచ్ రిఫరీ.. భారీ జరిమానా

**హైదరాబాద్ పెన్ పవర్:** మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన నాల్గవ టెస్టులో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, సామ్ కొంటాస్ మధ్య వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ గొడవలో భారత స్టార్‌దే తప్పని ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తేల్చారు. ఈ క్రమంలో కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా, ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. మ్యాచ్ రిఫరీ నిర్ణయాన్ని కోహ్లీ సైతం అంగీకరించినట్లు తెలుస్తోంది. జరిమానాతో సరిపెట్టారు కనుక కోహ్లీపై నిషేధం వంటి వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. నిజానికి ఐసీసీ ప్రవర్తనా నియమావళి 2.12 ప్రకారం, ఇలాంటి ఘటనల్లో ఒక ఆటగాడు..ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి ఆటగాడి పట్ల భౌతికంగా ప్రమేయం ఉన్నట్లు తేలితే ఒక మ్యాచ్ నిషేధం పడనున్నట్లు చెప్తున్నాయి. కోహ్లీ స్టార్ కనుక మ్యాచ్ రిఫరీ.. ఈ తప్పును లెవల్ 1 కింద పరిగణించినట్లు తెలుస్తోంది. దాంతో జరిమానాతో సరిపెట్టారు.

**అసలేం జరిగింది..?**


ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తరపున టెస్ట్ అరంగేట్రం చేసిన 19 ఏళ్ల యువకుడు సామ్ కొంటాస్ పట్ల కోహ్లీ అత్యుత్సాహం చూపాడు. క్రీజు పక్కన ఇద్దరూ ఎదురెదురుగా వెళ్తున్న సమయంలో ఒకర్ని ఒకరు ఢీకొన్నారు. వైరల్ అవుతోన్న వీడియోలో కోహ్లీ కావాలనే కొంటాస్‌ను ఢీకొట్టినట్లు అనిపిస్తోంది. విరాట్ కావాలనే తన డైరక్షన్ మార్చుకున్నట్లు కనపడుతోంది. గొడవ పెద్దది అయ్యేలా కనపడటంతో.. వెంటనే మరో ఓపెనర్ ఉస్మాన్ ఖావాజా, అంపైర్ జోక్యం చేసుకొని ఇద్దరికీ సర్ది చెప్పారు.





# గాడిన పడుతున్న సచిన్ తనయుడు.. 50 వికెట్ల క్లబ్‌లో అర్జున్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో 50 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో గోవాకు ప్రాతినిథ్యం వహిస్తున్న అర్జున్.. ఒడిశాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో అర్జున్ టెండూల్కర్ 3 వికెట్లు పడగొట్టాడు.

లెఫ్ట్ ఆర్మ్ పేసరైన అర్జున్ 2021లో ముంబై తరఫున టీ20ల్లో అరంగేట్రం చేశాడు. ఆ తరువాత అవకాశాలు రాక 2022/23 సీజన్‌లో గోవాకు తన మకాం మార్చాడు. ఇప్పటివరకు 41 వైట్ బాల్ మ్యాచ్‌ల్లో 51 వికెట్లు, 17 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 24 వికెట్లు, 24 టీ20లో 27 వికెట్లు పడగొట్టాడు. ఈ పేసర్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడుతున్నాడు. 2021లో ముంబై ఇండియన్స్ జట్టులో చేరిన అర్జున్.. అరంగ్రేటం చేయటానికి రెండేళ్ల సమయం పట్టింది. ఐపీఎల్ 2023 సీజన్‌లో సచిన్ తనయుడు ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్( %ఖూా% 2025) మెగావేలంలో ముంబై యాజమాన్యం అతన్ని రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది. ఇప్పటివరకు 5 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 3 వికెట్లు పడగొట్టాడు.

# సమంత ఇంకా దూరం దూరం..!



అవ్నీత్ కౌర్ లుక్స్ మిమ్మల్ని ఫ్యాషన్‌తో ప్రేమలో పడేలా చేస్తాయి

సౌత్ స్టార్ హీరోయిన్స్ లో ఒకరైన సమంత ఇప్పుడు ఆ సౌత్ ఇండస్ట్రీకి దూరమై పూర్తిగా బాలీవుడ్ లోనే సినిమాలు చేయాలని భావిస్తుందని తెలుస్తుంది. తెలుగు, తమిళ్ లో స్టార్ డం కొనసాగించిన సమంత ఇక మీదట తన కెరీర్ అంతా కూడా బాలీవుడ్ లోనే అని అనేస్తుందట. సౌత్ లో ఇక సినిమాలు చేయడం కష్టమే అని అన్నట్టు చెబుతుంది. దీనికి కారణం సౌత్ లో చేస్తే సినిమాలు చేయాలి లేదంటే లేదు. కానీ బాలీవుడ్ లో అయితే సినిమాలే కాదు వెబ్ సీరీస్ లతో కూడా అలరించే ఛాన్స్ ఉంటుంది. సమంత చేసిన రెండు బాలీవుడ్ సీరీస్ లు కూడా గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. రాజ్ అండ్ డీకేతో చేతులు కలిపి సమంత చేసిన మొదటి వెబ్ సీరీస్ ఫ్యామిలీ మ్యాన్ 2 సూపర్ సక్సెస్ కాగా కొద్దిపాటి గ్యాప్ తర్వాత సమంత చేసిన సిటాడెల్ హనీ బన్నీ కూడా సూపర్ హిట్ అయ్యింది. బాలీవుడ్లో సక్సెస్ అంటే అది సినిమాల వల్లే కాదు వెబ్ సీరీస్ లతో కూడా పొందే ఛాన్స్ ఉందని కనిపెట్టిన సమంత ఇక మీదట అక్కడే వరుస వెబ్ సీరీస్ లను చేయాలని ఫిక్స్ అయ్యింది. ఈ క్రమంలో తెలుగు నుంచి ఆఫర్లు వచ్చినా కూడా చేయడానికి ఆమె సుముఖంగా లేదని తెలుస్తుంది. సమంత ని ఆమె సౌత్ ఫ్యాన్స్ ఎంతో మిస్ అవుతున్నా కూడా తనకు నచ్చే కథ దొరికే వరకు ఇక్కడ సినిమాలు చేయడం కష్టమని తెలుస్తుంది. ఒకవేళ బాలీవుడ్ లో వరుస ప్రాజెక్ట్ లతో బిజీ అయితే మాత్రం తెలుగు, తమిళ పరిశ్రమల నుంచి ఆఫర్లు వచ్చినా కూడా చేయడం కష్టమవుతుంది.

సమంత నిర్మాతగా మా ఇంటి బంగారం సినిమా అనౌన్స్ చేసింది. ఐతే అది ప్రకటించి ఏడాది పైన అవుతున్నా కూడా ఆ సినిమా గురించి ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. అందుకే సమంత సౌత్ సినిమాలకు దూరం దూరంగా బాలీవుడ్ కి దగ్గర దగ్గరగా ఉందనిపిస్తుంది. ఈమధ్య అమ్మడు ఎక్కువగా ముంబైలోనే స్పెండ్ చేస్తుంది. చూస్తుంటే అటు ఇటు తిరిగలేక పూర్తిగా ముంబై షిఫ్ట్ అయిపోయినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదని చెప్పొచ్చు. ఐతే అలా చేస్తే మాత్రం సమంత సౌత్ ఫ్యాన్స్ చాలా హర్ట్ అవుతారు.





ఇన్‌స్టాగ్రామ్ మూమెంట్స్‌ను పెంచుతున్న భాగ్యశ్రీ బోర్స్ ఉష్ణోగ్రత

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com